www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

| సంపుటి : 17 | సంచిక : 177 | గురువారం 20.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/- |
|---|---|---|---|---|---|

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039






# రైతు ఆదాయమే లక్ష్యం

## ఖాతాలు తెరవడమే ఆర్థిక సమ్మిళితం కాదు

**రుణాన్ని స్థిరమైన వ్యవసాయ ఆదాయంగా మార్చాలి**

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలి

వ్యవసాయ రంగమే తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు పునాది

- 19.13 లక్షల జనధన్ ఖాతాల్లో జీరో బ్యాలెన్స్‌పై భట్టి ఆందోళన
- ఖాతాలు తెరవడమే ఆర్థిక సమ్మిళితం కాదు
- ప్రతి గ్రామానికి బ్యాంకింగ్ సేవలు అందేలా చర్యలు
- మహిళా సంఘాలను మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌గా తీర్చిదిద్దాలి
- తెలంగాణ రైజింగ్ 2047కు బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్ అవసరం
- యువత ఉపాధి, గ్రీన్ ఫైనాన్స్‌కు ప్రత్యేక రుణాలు 02
- ప్రభుత్వ పథకాల రీయింబర్స్‌మెంట్లు సకాలంలో చెల్లిస్తాం
- రుణాల పరిమాణం కాదు.. వాటితో వచ్చిన అభివృద్ధే కొలమానం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వ వ్యయంతోనే సాధ్యం కాదు.. భారీ ప్రైవేట్ పెట్టుబడులు, బలమైన ఆర్థిక సంస్థలు అవసరం రైతు కోసం బ్యాంకు వెతకడం కాదు.. బ్యాంకింగ్ వ్యవస్థే రైతు వద్దకు వెళ్లాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో 50వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' కేవలం విజన్ డాక్యుమెంట్ కాదని.. తెలంగాణ ప్రజలతో ప్రభుత్వం చేసుకున్న అభివృద్ధి ఒప్పందమన్నారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ బ్యాంకింగ్ వ్యూహాన్ని రూపొందించాలని బ్యాంకర్లకు సూచించారు. తెలంగాణను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో బ్యాంకింగ్...

# ప్రజల వద్దకే ప్రభుత్వం

## పల్లె పల్లెకు పొన్నం.. పల్లె పల్లెలో ప్రజాపాలన

- గ్రామాల్లో పల్లె దవాఖానాలకు మంత్రి పొన్నం ప్రారంభోత్సవం
- రూ.20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానాలు ప్రారంభం
- గ్రామాల్లో నేరుగా ప్రజల సమస్యలు తెలుసుకున్న మంత్రి
- వరుసగా గ్రామసభలు నిర్వహించి సమస్యలు నమోదు చేస్తాం 03
- ప్రతి సమస్యను రికార్డు చేసి పరిష్కారానికి చర్యలు
- విద్య, వైద్యం, వ్యవసాయంపై గ్రామాల వారీగా సమీక్ష







# విద్యార్థుల గొంతు నులిమిన సీఐ..

## సీఐపై చర్యలకు విద్యార్థి సంఘాల డిమాండ్

- మహబూబాబాద్ కలెక్టరేట్ వద్ద తీవ్ర ఉద్రిక్తత
- ఆందోళన చేస్తున్న విద్యార్థుల గొంతు నొక్కిన సీఐ
- ఇద్దరు విద్యార్థుల గొంతు గట్టిగా పట్టుకున్న రఘుపతి రెడ్డి
- ఊపిరాడక తీవ్ర భయాందోళనకు గురైన విద్యార్థులు
- విద్యార్థులపై సీఐ దురుసు ప్రవర్తన.. వీడియో వైరల్ 02
- సీఐ తీరుపై స్థానికులు, ప్రజల ఆగ్రహం
- విద్యార్థులపై పోలీసుల వైఖరిపై తీవ్ర నిరసన
- శాంతియుత నిరసనలో సీఐ దురుసు ప్రవర్తనపై మండిపాటు
- సీఐ రఘుపతి రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్




# కేంద్రానివి కుట్రపూరిత రాజకీయాలు

## బీజేపీ-బీఆర్ఎస్ కలిసి ఓట్ల తొలగింపు కుట్రలు

**దళిత, గిరిజన, మైనారిటీ ఓట్లే లక్ష్యంగా కుట్ర**

ప్రభుత్వంపై నెలకు రూ.4-5 కోట్లతో దుష్ప్రచారం

- ఓట్ల తొలగింపుతో కాంగ్రెస్‌ను దెబ్బతీసే కుట్ర: పొంగులేటి
- ప్రజాస్వామ్య వ్యవస్థలను భాజపా దుర్వినియోగం చేస్తోంది
- బీజేపీ-బీఆర్ఎస్ కలిసి ఓట్ల తొలగింపు కుట్రలు: మంత్రి
- 67 నుంచి 68 లక్షల ఓట్ల తొలగింపునకు కుట్ర
- మరో 70 లక్షల ఓట్లపై గందరగోళం సృష్టిస్తున్నారు
- ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ సమరశంఖం
- బూత్ స్థాయి కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ 03

ఎస్ఐఆర్ అనే ప్రక్రియను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీతో కలిసి భాజపా కుట్రలు చేస్తోందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచే దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల ఓట్లే లక్ష్యంగా సుమారు 67 నుంచి 68 లక్షల ఓట్లను తొలగించేందుకు ...

**ఆక్రమణలపై క్షేత్రస్థాయి విచారణ** 02

రూ.61.76 కోట్లతో ప్రగతి పరుగులు...

ఈ నెల 31లోగా పించన్ల దరఖాస్తు...

# సీఎం పొంగులేటినా..లేక రేవంతా..



## 'టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా'.. సుష్మితా పటేల్ సంచలన ప్రకటన


రేవంత్‌తో పాటు ఓ 'పొంగు' ఉంది.. ఎక్కువసేపు పొంగదు

- పరకాల టికెట్‌పై కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు
- రేవూరికి మళ్లీ టికెట్ ఎలా ప్రకటిస్తారు?
- ఎన్నికలకు రెండేళ్లు ఉండగానే అభ్యర్థిని ఎలా ఖరారు చేస్తారు?
- పరకాలలో రేవూరి ఎవరికైనా తెలుసా?
- కొండా మురళిని రేవంత్ ఎందుకు తొక్కుతున్నారు? 03

# ఒక్కసారి ఆలోచించుకోండి..


## కలెక్టర్లే లంచాలు తీసుకోమని చెబుతున్నారు

### సర్వేయర్లను బెదిరించడం సిగ్గుచేటు



- సర్వేయర్లపై ఐఏఎస్ అధికారి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం
- ప్రభుత్వ అహంకారానికి సర్వేయర్ల అరెస్టులే నిదర్శనం
- యువత తిరగబడితే ఏమవుతుందో ఆలోచించండి
- 6 వేల సర్వేయర్లు.. 6 వేల కుటుంబాలు ఓ శక్తి
- యువత తిరగబడే పరిస్థితి రాకముందే సమస్యలు పరిష్కరించాలి
- సర్వేయర్లను బెదిరించడం సిగ్గుచేటు
- అరెస్టు చేసి అన్నం కూడా పెట్టకుండా హింసించారు
- ప్రజలు ప్రతిపక్షం దగ్గరకు వస్తే తప్పేంటి?: హరీశ్ రావు
- ఈగోలు ముఖ్యమా.. ప్రజా సమస్యలు ముఖ్యమా?
- సీఎం ఈగో హర్ట్ అయిందని ప్రజలను వెళ్లగొడతారా? 03
- రేవంత్ రెడ్డి ఆకాశం నుంచి ఊడిపడ్డాడా?: హరీశ్ రావు
- ముఖ్యమంత్రి పదవి ప్రజలు పెట్టిన భిక్ష

**22ఏ అంశం సీఎంకు తెలియకుండా జరుగుతోందా?**




# హైకోర్టు కీలక వ్యాఖ్యలు

- తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో కీలక పరిణామం
- ఉచిత పథకాలకు ప్రజాధనం ఖర్చు చేయడంపై హైకోర్టు ప్రశ్నలు
- చట్టబద్ధత లేని ఉచిత పథకాలకు నిధులు ఎలా ఖర్చు చేస్తారు?
- ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తీసుకురావచ్చుగా 02



# హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ప్రభుత్వానికి తెలంగాణ ఉన్నత న్యాయ-స్థానం (హైకోర్టు)లో కీలక పరిణామం ఎదురైంది. రాష్ట్రంలో అమలు చేస్తున్న ఉచిత సంక్షేమ పథకాలు, భూసేకరణ బాధితులకు చెల్లించాల్సిన నష్టపరిహారం వివాదంపై విచారణ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల అమలు, భూసేకరణ బాధితుల పిటిషన్లపై విచారణ సందర్భంగా కోర్టు స్పందిస్తూ చట్టబద్ధత లేని ఉచిత పథకాల కోసం ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు చేస్తే ఎలా అని ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను నష్టాల నుంచి గట్టెక్కించి లాభాల్లోకి తీసుకువస్తే.. ఆ ద్వారా వచ్చే ఆదాయాన్నీ ఇలాంటి ఉచిత పథకాలకు ఖర్చు చేయవచ్చు కదా అని ధర్మాసనం ప్రభుత్వానికి సూచించింది.

**భూ బాధితుల పరిహారంపై ఆదేశాలు..**

రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన బాధితులకు సరైన రీతిలో న్యాయం జరగక, నష్టపరిహారం కోసం ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందని హైకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. ఉచిత పథకాలకు నిధులు కేటాయిస్తున్నప్పుడు, భూములు కోల్పోయిన బాధితుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో స్పష్టం చేయాలని సూచిస్తూ.. దీనిపై రేపటిలోగా సమాధానం చెప్పాలని ఆదేశించింది. కాగా, రాష్ట్రంలో పేద యువతుల వివాహాల కోసం ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం 'కల్యాణలక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలను అమలు చేస్తోంది. అయితే, ఈ పథకానికి సంబంధించి తలెత్తిన కొన్ని న్యాయపరమైన అంశాలు, నిధుల వినియోగంపై గతంలో కోర్టు కొన్ని ఆదేశాలు ఇవ్వడం లేదా స్టే విధించడం జరిగింది. ఈ నేపథ్యంలో పథకం అమలు సజావుగా సాగేలా కల్యాణలక్ష్మి, షా-దీముబారక్ల పై ఉన్న స్టేను ఎత్తివేయాలని ప్రభుత్వం హైకోర్టును కోరింది. ప్రభుత్వ విజ్ఞప్తి, భూ బాధితులకు సంబంధించిన పరిహారంపై స్పష్టత వచ్చేందుకు ఈ కేసు విచారణను ధర్మాసనం రేపటికి వాయిదా వేసింది.

## ఆర్మూర్లో 44వ నెంబర్ నేషనల్ హైవే పై ప్రమాదం..



**ఆర్మూర్,ఫ్లాష్ ఇండియా :** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్ర పరిధిలోని కోటార్ మూర్ రెవెన్యూ ఏరియాలో 44వ నెంబర్ జాతీయ రహదారి ప్రక్కన డంపింగ్ యార్డ్ సమీపంలో ప్రమాదం జరిగింది. 44వ నెంబర్ జాతీయ రహదారి పై టమాటా లోడుతో నాగపూర్ వెళ్తున్న లారీ ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని కోటారుమూరు రెవెన్యూ ఏరియాలో డంపింగ్ యార్డ్ సమీపంలో లారీ అదుపు తప్పి జాతీయ రహదారి బైపాస్ పై నుండి బోల్తా కొట్టింది. లారీ నడుపుతున్న డ్రైవర్ కు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా ఆయన పరిస్థితి విషమంగా ఉంది. లారీలోని క్లీనర్ కు స్వల్ప గాయాలు అయ్యాయి. టమాటా లోడుతో బోల్తా కొట్టిన లారీ నుంచి టమాటలను వేరే లారీలోకి ఆ లారీకి సంబంధించిన యజమానులు షిఫ్టింగ్ చేస్తున్నారు.

# విద్యార్థుల గొంతు నులిమిన సీఐ..

**మహబూబాబాద్,ఫ్లాష్ ఇండియా :** మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట పట్టిన పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల పోలీస్ అధికారి అత్యంత దురుసుగా ప్రవర్తించడం కలకలం రేపింది. ఆందోళన చేస్తున్న సమయంలో సీఐ రఘుపతి రెడ్డి ఇద్దరు విద్యార్థుల గొంతును గట్టిగా నొక్కి పట్టి కాసేపటి వరకు వదలకుండా చేయడంతో ఆ విద్యార్థులు ఊపిరాడక తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

**సోషల్ మీడియాలో వీడియో వైరల్.. మండిపడుతున్న స్థానికులు**

శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై సీఐ రఘుపతి రెడ్డి చెయ్యి చేసుకుని గొంతు నొక్కి పట్టిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పరిస్థితిని సమన్వయంతో అదుపులోకి తీసుకురావాల్సిన బాధ్యతాయుతమైన పోలీస్ అధికారి, విద్యార్థుల పట్ల ఇలా ప్రవర్తించడం పట్ల స్థానికులు, ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ హక్కుల కోసం, న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన బాట పట్టిన విద్యార్థుల పట్ల పోలీసుల ఈ వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

**సీఐపై చర్యలకు విద్యార్థి సంఘాల డిమాండ్**

విద్యార్థులపై అమానుషంగా ప్రవర్తించిన సీఐ రఘుపతి రెడ్డిపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విద్యార్థుల ప్రాణాలకు ముప్పు కలిగించేలా ప్రవర్తించిన సదరు అధికారిని విధుల్లోంచి తొలగించాలని, బాధితులకు న్యాయం చేయాలని వారు స్పష్టం చేస్తున్నారు.

# సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాను



**న్యూ ఢిల్లీ :** కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా గుండె సంబంధిత సమస్యతో ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో చేరి యాంజియోప్లాస్టీ చేయించుకున్న విషయం తెలిసిందే. అయితే ఆయన ఆసుపత్రి నుంచి విజయవంతంగా డిశ్చార్జ్ అయ్యారు. ఆగస్టు 13న స్వల్ప అస్వస్థతకు గురికావడంతో ఎయిమ్స్‌లో చేరిన ఆయనకు వైద్యులు కొరోనరీ యాంజియోగ్రఫీ పరీక్షలు నిర్వహించి, ఆగస్టు 17న విజయవంతంగా యాంజియోప్లాస్టీ పూర్తి చేశారు. అనంతరం కార్డియాలజీ విభాగంలో వైద్యుల పర్యవేక్షణలో ఉండి కోలుకున్న ఆయన, బుధవారం సంపూర్ణ ఆరోగ్యంతో ఆసుపత్రి నుంచి నివాసానికి చేరుకున్నారు. ఈ క్రమంలో తాను సంపూర్ణ ఆరోగ్యంతో, క్షేమంగా ఉన్నానని స్వయంగా జేపీ నడ్డా సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు. ఆస్పత్రిలో ఉన్న సమయంలో తనకు అత్యుత్తమ వైద్య సేవలు అందించి అంకితభావంతో చూసుకున్న ఎయిమ్స్ వైద్యులు, నర్సింగ్ మరియు సహాయక సిబ్బందికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే తాను త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు చేసి, సందేశాలు, ఫోన్ కాల్స్ ద్వారా యోగక్షేమాలు విచారించిన శ్రేయోభిలాషులు, పార్టీ శ్రేణులు మరియు ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన కోలుకోవడం పట్ల కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హర్షం వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్‌లోకి 200 మంది కాంగ్రెస్ కార్యకర్తలు



**నల్లగొండ,ఫ్లాష్ ఇండియా :** నల్లగొండ మండలం చందనపల్లిలో కాంగ్రెస్‌కు చెందిన 200 మందికిపైగా నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎంపీటీసీ పెద్ది ఇందిరమ్మ వెంకటయ్య ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ సురిగి మణెమ్మ రమేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తన శిబిర కార్యాలయంలో వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భూపా-ల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రస్తుతం ప్రజలకు దూరమయ్యాయని విమర్శించారు. తన ఎమ్మెల్యే హయాంలో నల్లగొండ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రస్తుత మంత్రి తన ఖాతాలో వేసుకుంటున్నారని ఆరోపించారు. ఎల్లమ్మగుడి--రామగిరి డీఈఓ రహదారి పనులు గతంలోనే మంజూరైనా, వాటికి ఇప్పుడు శంకుస్థాపన చేసి తానే మంజూరు చేసినట్లు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మర్రిగూడ బైపాస్‌కు గతంలో రూ.45 కోట్లు మంజూరు చేయించామని, పనులు చివరి దశలో నిలిచిపోయాయని తెలిపారు. నల్లగొండ అభివృద్ధికి మరో రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని భూపాల్‌రెడ్డి అన్నారు. ధర్వేశిపురం, చందనపల్లి నుంచి పెద్దఎత్తున చేరికలు రాజకీయ మార్పునకు సంకేతమని పేర్కొన్నారు. కొత్తగా చేరిన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కటికం సత్తయ్యగౌడ్, దేప వెంకట్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, నారాబోయిన బిక్షం, తుమ్మల లింగస్వామి, ధోటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో తంతెనపల్లి శంకర్, వెంకన్న, ఇంద్రయ్య, గోపాల్, పవన్‌కళ్యాణ్, సాలయ్య, సందీప్, జక్కలి రాములు, తంతెనపల్లి స్వామి, సురేష్, రవి, చిన్న శంకర్, పాలడుగు శంకర్, తెల్లమల్ల చంటి తదితరులు ఉన్నారు.

# ఆక్రమణలపై క్షేత్రస్థాయి విచారణ



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** పల్లెగూడెంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను అక్రమంగా ఆక్రమించిన వారి నుంచి వెంటనే స్వాధీనం చేసుకుని, గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, ఆక్రమణలను గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో రూ. 20లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హుడికీ సొంతింటి కల నె-రవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకోసమే భూములను సమీకరించి ఇళ్ల స్థలాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

**రూ.61.76 కోట్లతో ప్రగతి పరుగులు...**

పల్లెగూడెం సమగ్ర వికాసానికి రూ.61.76 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి ప్రకటించారు. గ్రామంలో ఇప్పటికే రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందని, గొల్లగూడెం నుంచి పల్లెగూడెం వరకు ఎన్ఎస్పీ కాల్వ గట్టుపై రూ.5.80 కోట్లతో మోడల్ సీసీ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా, పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు రూ.55 కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రూ.20 లక్షల వ్యయంతో పంచాయతీ కార్యాలయ భవనాన్ని కేవలం రెండు నెలల వ్యవధిలోనే నాణ్యతతో పూర్తి చేయడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను మంత్రి అభినందించారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షలతో నూతన అంగన్‌వాడీ భవనాన్ని కూడా తక్షణమే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

**ఈ నెల 31లోగా పింఛన్ల దరఖాస్తు...**

అర్హులైన వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అనిత సర్పంచ్ చుండూరి సుజన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట వీరభద్రం నాయకులు మద్ది మల్లారెడ్డి, బండి జగదీష్, చావా శివరామకృష్ణ, మద్ది వీరారెడ్డి, వీరెల్లి అప్పారావు, బోడ వెంకన్న సిపిఐ నాయకులు దండి సురేష్, పుచ్చకాయల కమలాకర్, లింగ వెంకట్ నారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు , గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు ఆదాయమే లక్ష్యం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వ వ్యయంతోనే సాధ్యం కాదు.. భారీ ప్రైవేట్ పెట్టుబడులు, బలమైన ఆర్థిక సంస్థలు అవసరం రైతు కోసం బ్యాంకు వెతకడం కాదు.. బ్యాంకింగ్ వ్యవస్థే రైతు వద్దకు వెళ్లాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో 50వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' కేవలం విజన్ డాక్యుమెంట్ కాదని.. తెలంగాణ ప్రజలతో ప్రభుత్వం చేసుకున్న అభివృద్ధి ఒప్పందమన్నారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ బ్యాంకింగ్ వ్యూహాన్ని రూపొందించాలని బ్యాంకర్లకు సూచించారు. తెలంగాణను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో బ్యాంకింగ్, ఆర్థిక రంగాలు కీలక భాగస్వాములుగా మారాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కేవలం ప్రభుత్వ వ్యయంతోనే ఈ లక్ష్యాలను సాధించడం సాధ్యం కాదని, భారీ ప్రైవేట్ పెట్టుబడులు, బలమైన ఆర్థిక సంస్థలు, లోతైన ఆర్థిక మార్కెట్లు, వినూత్న నిధుల విధానాలు అవసరమని స్పష్టం చేశారు. బ్యాంకులు కేవలం నిర్దేశించిన రుణ లక్ష్యాలను చేరుకోవడానికే పరిమితం కాకుండా.. తాము ఇచ్చిన రుణాలతో ఎన్ని పరిశ్రమలు ఏర్పడ్డాయి, ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి, వ్యవసాయ ఉత్పాదకత ఎంత పెరిగింది, గ్రామీణ ఆదాయాలు ఎంత మె-రుగుపడ్డాయనే అంశాలను నిరంతరం సమీక్షించుకోవాలని సూచించారు. రుణాల పరిమాణం కంటే.. వాటి ద్వారా సృష్టించిన అభివృద్ధి, ఉపాధి, ఆదాయమే బ్యాంకింగ్ పనితీరుకు నిజమైన కొలమానం కావాలన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గ్రామీణ వ్యవసాయ రంగమే పునాది. రైతులకు అవసరమైన సమయంలో రుణాలు అందేలా బ్యాంకులు ముందడుగు వేయాలన్నారు. "రైతు రుణం కోసం బ్యాంకును వెతుక్కుంటూ రావడం కాదు.. బ్యాంకింగ్ వ్యవస్థే రైతుల వద్దకు వెళ్లాలి" అని స్పష్టం చేశారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి అనుబంధ రంగాలను కూడా అధికారిక రుణ వ్యవస్థలోకి తీసుకురావాలని సూచించారు. రుణం ఇవ్వడమే కాకుండా.. దానిని స్థిరమైన వ్యవసాయ ఆదాయంగా మార్చే విధంగా బ్యాంకింగ్ వ్యూహాలు ఉండాలని కోరారు. రైతు రుణం తిరిగి చెల్లించలేని పరిస్థితి ఎదురైతే కేవలం రికవరీ చర్యలకే పరిమితం కాకుండా.. ఆదాయం తగ్గడానికి గల కారణాలను విశ్లేషించాలన్నారు. ఉత్పాదకత, మార్కెట్ సదుపాయాలు, కోత అనంతర వసతులు, వర్కింగ్ క్యాపిటల్ వంటి అంశాలను రుణ వ్యూహంలో భాగం చేయాలని సూచించారు. జూన్ 2026 నాటికి వ్యవసా-య రంగానికి రూ.52,337 కోట్ల రుణాలు అందించినందుకు బ్యాంకర్లను అభినందించారు.. రుణ పరిమాణంతో పాటు సకాలంలో రుణం అందడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో ఎంఎస్ఎంఈ రంగం కీలక పాత్ర పోషించనుందన్నారు. రుణం మంజూరు కావడం కంటే.. వ్యాపార అవసరానికి అనుగుణంగా సరైన సమయంలో డబ్బు చేతికి అందడం ముఖ్యమన్నారు. రుణ దరఖాస్తు, మంజూరు, పంపిణీ ప్రక్రియకు స్పష్టమైన, కొలవదగిన కాలపరిమితులు ఉండాలని ఆదేశించారు. సీజీటీఎంఎస్ఈ కింద ఈ త్రైమాసికంలో రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదం పొందినందుకు బ్యాంకర్లను అభినందించారు. పూచీకత్తు నిబంధనల పేరుతో చిన్న వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ఆర్థిక సామర్థ్యాలు, అవసరాలను దృష్టిలో పెట్టుకుని క్యూర్, ప్యూర్, రేర్ విధానాలకు అనుగుణంగా ప్రత్యేక రుణ వ్యూహాలు రూపొందించాలన్నారు.

**క్యూర్:** ఏఐ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, ఏరోస్పేస్, స్టార్టప్‌లు, నాలెడ్జ్ ఆధారిత రంగాలకు అధునాతన ఫైనాన్సింగ్.

**ప్యూర్:** తయారీ, లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్, పారిశ్రామిక క్లస్టర్లు, గృహ నిర్మాణం, మౌలిక వసతులకు నిధులు.

**రేర్:** వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, డెయిరీ, ఫిషరీస్, గ్రామీణ పరిశ్రమలకు సకాలంలో, సరసమైన రుణాలు.

రాష్ట్రంలో జనధన్ ఖాతాలు భారీగా ఉన్నప్పటికీ సుమారు 19.13 లక్షల ఖాతాల్లో జీరో బ్యాలెన్స్ ఉండటాన్ని డిప్యూటీ సీఎం ప్రస్తావించారు. కేవలం బ్యాంకు ఖాతాలు తెరవడం ఫైనాన్షియల్ ఇంక్లూజన్ కాదని.. పొదుపు, బీమా, రుణాల వైపు ప్రజలను తీసుకెళ్లడమే నిజమైన ఆర్థిక సమ్మిళితమన్నారు. గ్రామాల్లో నిష్క్రియాత్మకంగా ఉన్న బిజినెస్ కరస్పాండెంట్లను వెంటనే క్రియాశీలం చేయాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రతి గ్రామానికి బ్యాంకింగ్ సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాలను కేవలం బ్యాంకు లింకేజీలకే పరిమితం చేయకుండా.. వాటిని మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌గా తీర్చిదిద్దే 'ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్' అందించాలని కోరారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 'తెలంగాణ రైజింగ్ 2047 బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్' రూపొందించాలని డిప్యూటీ సీఎం ప్రతిపాదించారు. వ్యవసాయ, ఉత్పాదకత ఆధారిత రుణాలు, ఎంఎస్ఎంఈ--స్టార్టప్ ఫైనాన్స్, మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాలు, గ్రామీణ పరిశ్రమలు, యువత ఉపాధి ఆధారిత రుణాలు, గ్రీన్--క్లైమేట్ ఫైనాన్స్, డిజిటల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్, జిల్లాల మధ్య క్రెడిట్ వ్యత్యాసాల నివారణ, దీర్ఘకాలిక మౌలిక వసతుల ఫైనాన్స్, కొత్త పరిశ్రమలు--సాంకేతిక రంగాలకు నిధుల వంటి అంశాలకు స్పష్టమైన వార్షిక లక్ష్యాలను నిర్దేశించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకులకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్లు సకాలంలో అందేలా చూసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజల సమగ్ర ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో బ్యాంకింగ్ రంగ ప్రతినిధులు చురుకైన భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సెర్ప్ సీఈఓ దివ్య, నాబార్డ్ సీజీఎం చిన్మయ్ కుమార్, ఎస్‌బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ సతీష్ కుమార్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, డీఎఫ్ఎస్ డైరెక్టర్ మానస గంగోత్రి తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# ఒక్కసారి ఆలోచించుకోండి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తమ హక్కుల కోసం 6 వేల మంది లైసెన్స్ సర్వేయర్లు ధర్నా చేస్తే వాళ్లను పశువుల్లా ఈడ్చుకెళ్లి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం దారుణం అని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. బీటెక్, ఎంటెక్, సివిల్ ఇంజనీరింగ్ లాంటి ఉన్నత చదువులు చదివిన యువశక్తిని ఉద్దేశించి ఐఏఎస్ అధికారి లోకేశ్ కుమార్ అత్యంత బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం దుర్మార్గం అని, తమ సమస్యలు చెప్పుకోవడానికి వెళ్లిన సర్వేయర్లను ఉద్దేశించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతిలో ఏది ఉంటే దానితో కొట్టేవారు అని లోకేశ్ మాట్లాడటం ఈ ప్రభుత్వ అహంకారానికి, అణచివేతకు నిదర్శనం అన్నారు. తెలంగాణ భవన్‌లో లైసెన్స్ సర్వేయర్లతో సమావేశమైన మాజీ మంత్రి హరీశ్ రావు ఈ సందర్భంగా మాట్లాడారు.

**తిరగబడితే ఏమవుతుందో ఆలోచించుకోండి:**

విద్యార్థులు, యువకులు తిరగబడితే మొన్న ఢిల్లీలో ఏమైందో దేశం మొత్తం చూసిందని వాళ్ల దెబ్బకు కేంద్రమంత్రే రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. పిల్లలే కదా అని చిన్నచూపు చూస్తే వాళ్లు చిచ్చరపిడుగులై వ్యవస్థలనే కదిలించారు. ఇప్పుడు ఈ 6,000 మంది లైసెన్స్ సర్వేయర్లు, వారి వెనకున్న 6,000 కుటుంబాలు ఒక శక్తిగా మారి తిరగబడితే ఏమవుతుందో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి ఆలోచించుకోవాలన్నారు. యువత తిరగబడే పరిస్థితి రాకముందే, వెంటనే సర్వేయర్లను పిలిచి మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. అరెస్టు చేసి కనీసం అన్నం కూడా పెట్టకుండా హింసించడం దారుణం అని మీరు హరీశ్ రావు దగ్గరికి, బీఆర్ఎస్ నాయకుల దగ్గరికి ఎందుకు వెళు న్నారు? అని సర్వేయర్లను ప్రభుత్వం బెదిరించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు.

**ఈగోలు ముఖ్యమా? ప్రజా సమస్యలు ముఖ్యమా?:**

ప్రభుత్వం సమస్యలను పట్టించుకోనప్పుడే ప్రజలు ప్రతిపక్షం దగ్గరికి వస్తారు, అదే ప్రజాస్వామ్య స్ఫూర్తి. కష్టాల్లో ఉన్న ప్రజల పక్షాన నిలబడి, ప్రభుత్వ మెడలు వంచడానికే ప్రతిపక్షంగా మేమున్నాం.సీఎంఓ అధికారుల తీరు చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. చిన్నారెడ్డి లౌడ్ స్పీకర్ పెట్టి సీఎంవో స్పెషల్ సెక్రటరీ శేషాద్రితో మాట్లాడితే.. ముఖ్యమంత్రి ఈగో హర్ట్ అయింది, మీరు వాళ్లతో మాట్లాడొద్దు, వెళ్లగొట్టండి అని చెప్పడం అహంకారం కాదా? ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించాల్సిన తీరు ఇదేనా? మీకు ఈగోలు ముఖ్యమా? ప్రజా సమస్యలు ముఖ్యమా? అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ఏమైనా ఆకాశం నుంచి ఊడిపడ్డాడా? ముఖ్యమంత్రి పదవి ప్రజలు పెట్టిన భిక్ష.. అధికారులకు జీతాలు ఇచ్చేది ప్రజలు కట్టే పన్నుల నుంచే అన్న విషయం మర్చిపోవద్దన్నారు.

**కలెక్టర్లే లంచాలు తీసుకోమని చెబుతున్నారు:**

అప్పులపాలై, కుటుంబం గడవక ఇద్దరు లైసెన్స్ సర్వేయర్లు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరం అని మీకు కనీస జీతం లేదు, టీఏ/డీఏలు లేవు, హెల్త్ ఇన్సూరెన్స్ లేదు. మీ సొంత డబ్బులు పెట్టుకుని సర్వే చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. వంద రూపాయల పెట్రోల్ కొట్టి, 50 రూపాయలు పెట్టి అన్నం తిని.. ఎకరానికి కేవలం 60 రూపాయల చొప్పున సర్వే చేస్తే బతికేదెట్లా? ఇదే విషయం కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్తే.. మీరు లంచాలు తీసుకోండి, వసూలు చేసుకోండి అని చెప్పడం ఈ ప్రభుత్వ దివాళాకోర-ంతనానికి నిదర్శనం అన్నారు. 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడుతూ డబ్బా కొట్టుకుంటున్నాడు. కేసీఆర్ నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు పెట్టి, రిజల్ట్ ఇస్తే.. వీళ్లు కేవలం నియామక పత్రాలు ఇచ్చి మేమే ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకుంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా మేం నిలదీస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది కేవలం 16,500 ఉద్యోగాలు మాత్రమే అని ప్రభుత్వమే స్వయంగా ఒప్పుకుంది. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వచ్చి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.. ఇప్పుడేమో ఈ 6 వేల మందికి ఇచ్చిన లైసెన్స్ లను కూడా ఉద్యోగాల ఖాతాలో వే-సుకుని మోసం చేస్తున్నారని మండిపడ్డారు. లైసెన్స్ సర్వేయర్లు ఎవరూ ఆందోళన చెందవద్దని అధైర్యపడి ప్రాణాలు తీసుకోవద్దని మీకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని భరోసార ఇచ్చారు.

**22 ఏ వివాదం..రేవంత్‌కు సంబంధం లేకపోతే పొంగులేటిని భర్తరఫ్ చేయాలి: హరీశ్ రావు**

సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటికి రియల్ ఎస్టేట్ బాగా తెలిస్తే.. బీఆర్ఎస్ కు పోరాటం తెలుసని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. 22 ఏ విషయంలో పది రోజుల్లోనే మంత్రి పొంగులేటి మాట మార్చారని 10 రోజుల క్రితం ఒక్క ఎకరా కూడా 22ఏ లో పెట్టలేదని చెప్పిన మంత్రి ఇవాళ క్షమాపణలు చెబుతున్నారని, నిషేధిత జాబితా గురించి 4 నెలల క్రితమే సీఎంకు చెప్పానని మంత్రి కోమటిరెడ్డి అంటున్నారని కోమటిరెడ్డి చెప్పినప్పుడే సీఎం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. ఇదంతా సీఎం, మంత్రికి తెలియకుండానే జరుగుతోందా సీఎంకు ఈ విషయం తెలియకపోతే పొంగులేటిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అవాళ తెలంగాణ భవన్‌లో '22ఏ (ప్రొహిబిటెడ్ ల్యాండ్స్)' బాధితులు హరీశ్ రావును కలిసి తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన హరీశఅ రావు ఈ సమస్యను పరిష్కరిస్తారా లేక ప్రజల కాళ్ల కింద నలిగి పోతారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.జనతా గ్యారేజ్‌గా మారిన తెలంగాణ భవన్ బాధితులకు భరోసానిస్తాని అన్నారు. కాంగ్రెస్ సర్కారు అడ్డగోలు నిర్ణయాలతో సామాన్య కుటుంబాలు రోడ్డున పడ్డాయని, హిల్ట్ పాలసీ తీసుకొచ్చి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మేడ్చల్, రంగారెడ్డి ప్రజలు హాయిగా నిద్రపోయే పరిస్థితి లేదన్నారు. కోట్లాది ప్రజల ఆస్తులను పెట్టే ధైర్యం అధికారులకు ఉంటుందా? చీటికి మాటికి విచారణలు చేసే రేవంత్ రెడ్డి దీనిపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

# ఇకపై 'ఫాస్ట్ ట్రాక్' పరిష్కారం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో 22/ఎ నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టిందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22/ఎ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతోనే రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22/ఎ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ.. 22/ఎ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం, తిరస్కరించడం చేయవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించాలన్నారు.సంబంధిత భూమి 22/ఎ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చింది? అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి? హక్కుదారుడి వద్ద ఉన్న పత్రాలు ఏమిటి? గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు ఏమిటి? వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని వాటికి రిజిస్ట్రేషన్ ఎందుకు సాధ్యం కాదో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 22/ఎ భూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను కూడా పరిరక్షిస్తూ, ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

# కేంద్రానివి కుట్రపూరిత రాజకీయాలు



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ, ఓట్ల తొలగింపు పేరిట కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు కుట్రపూరిత రాజకీయాలకు ఒడిగడుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పీఏసీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కో ఇన్ చార్జి సచిన్ సావంత్ హాజరయ్యారు. స్థానిక పార్లమెంట్ సభ్యులు రఘురామ్ రెడ్డి, ఖమ్మం జిల్లా డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**ఓటర్ల తొలగింపుపై సమరశంఖం...**

ఎస్ఐఆర్ అనే ప్రక్రియను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీతో కలిసి భాజపా కుట్రలు చేస్తోందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచే దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల ఓట్లే లక్ష్యంగా సుమారు 67 నుంచి 68 లక్షల ఓట్లను తొలగించేందుకు శ్రీకారం చుట్టడమే కాకుండా, మరో 70 లక్షల ఓట్లను గాలిలో పెట్టి ఓటర్లను గందరగోళానికి గురిచేస్తున్నారని విమర్శించారు. ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు రాబోయే 4-5 రోజుల్లో బూత్ స్థాయి కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

**విషప్రచారాలను తిప్పికొట్టాలి...**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కనబెట్టి, ప్రతిపక్షాలు నెలకు రూ.4 నుంచి 5 కోట్లు ఖర్చు చేస్తూ సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, వాటిని శ్రేణులంతా సమ-ర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి అత్యధిక స్థానాలను గెలుచుకుని, రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేయడమే కాంగ్రెస్ శ్రేణుల ప్రధాన లక్ష్యమని పొంగులేటి స్పష్టం చేశారు.

# ప్రజల వద్దకే ప్రభుత్వం



**సైదాపూర్,ఫ్లాష్ ఇండియా :** పల్లె పల్లెకు పొన్నం అన్న..పల్లె పల్లెలో ప్రజాపాలన కార్యక్రమాన్ని సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి గ్రామంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. మండలంలోని దుద్దెనపల్లి, వెన్నంపల్లి, ఏక్లాస్ పూర్ గ్రామాల్లో రూ. 20 లక్షలతో నిర్మించిన పల్లె దవఖానాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం దుద్దెనపల్లి, వెన్నంపల్లి, ఎక్లాస్పూర్, సోమారం, గర్రెపల్లి, ఆరేపల్లి గ్రామాల్లో సర్పంచులు మ్యాకల స్వప్న, కందుల అనిత, మొలుగూరి చిరంజీవి, మేకల భాగ్యలక్ష్మి, ఉడిగ విజయ, వర్నే లావణ్య, మాచమల్ల శ్రీకాంత్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో నేరుగా గ్రామ-స్తుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని అధికారులకు పరిష్కారం అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని స్వయంగా సందర్శించి, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటాం. ప్రతి మండలంలో వరుసగా గ్రామాలను సందర్శించి గ్రామ-సభలు నిర్వహిస్తాం. గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రజలు లిఖితపూర్వకంగా అందజేయాలి. ప్రతి సమస్యను రికార్డు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణ ఉపాధి, మౌలిక వసతులు, సంక్షేమం తదితర అంశాలపై గ్రామాల వారీగా సమీక్ష చేస్తాం.

**ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించి..**

కొన్ని సమస్యలకు తక్షణ పరిష్కారం, మరికొన్ని దీర్ఘకాలిక పరిష్కారం అవసరం ఉంటుంది. సమస్య తీవ్రతను బట్టి ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా ఇరిగేషన్‌కు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలపై రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి, కేబినెట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటాం. వికలాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, నేత కార్మికులు తదితర అర్హులైన వర్గాలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తాం. రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను ప్రోత్సహిస్తాం. సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రతి ఇంటికీ చేరువ చేయడంపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తాం. సబ్సిడీ, రుణ సదు-పాయాలను ప్రజలకు వివరించి, అర్హులైన వారికి ప్రయోజనం అందేలా చూస్తాం. ప్రజాపాలన అంటే కార్యాలయాల్లో కూర్చొని పాలన చేయడం కాదు ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ప్రజాపాలన. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా పనిచేయాలి. ఓటర్లకు సంబంధించి వచ్చిన నోటీసులను పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం.

**ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతా..**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకం. అర్హత ఉన్న ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటం మనందరి బాధ్యత. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో ఉన్న అనుమానాలు, అభ్యంతరాలను ప్రజాస్వామ్య పద్ధతిలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా, గ్రామం నుంచి రాష్ట్రస్థాయి వరకు సమన్వయంతో ముందుకు వెళ్తాం. పల్లె పల్లెకు ప్రజాపాలన -- పల్లె పల్లెకు పొన్నం ద్వారా ప్రజల మధ్యే ఉండి, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతానని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, ఆర్డీఓ జల కుమారి, డిఎంహెచ్వో రాజగోపాల్, డి ఆర్ డి ఓ గీత, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ దంత సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు చాడ కొండాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గుండారం శ్రీనివాస్, తహసిల్దార్ గుర్రం శ్రీనివాస్, ఎంపీడీవో యాదగిరి, ఏవో వైద్యహిరాయి, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు ఉన్నారు.

# మార్కెట్ అభివృద్ధికి కృషి



**వికారాబాద్,ఫ్లాష్ ఇండియా :** మార్కెట్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించడమే కాకుండా మార్కెట్ను అభివృద్ధిలో తీర్చిదిద్ది రైతులకు వ్యాపారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలంగాణ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఆవరణలో గ్రేన్ మార్చంట్ అసోసియేషన్ కార్యాలయాన్ని అధ్యక్షులు ప్రభాకర్ కార్యవర్గ సభ్యులతో కలిసి స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ వ్యాపారులు రైతులకు నమ్మకంగా సేవలు అందించి మంచి పేరు సాధించాలని సూచించారు. మార్కెట్లో అన్ని సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధిలో తీర్చిదిద్దుతామని అన్నారు. రైతుల సమస్యలతో పాటు వ్యాపారులకు కూడా ఎలాంటి సమస్యలు లేకుండా అభివృద్ధికి కృషి చేస్తామని స్పీకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్, ముదిరాజ్ వైస్ చైర్మన్ మల్లేశం, వికారాబాద్ మునిసిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వనాథం సత్యనారాయణ, మాజీ పిఎసిఎస్ చైర్మన్ డిసిసిబి డైరెక్టర్ ఎన్ కిషన్ నాయక్, పాలకవర్గ సభ్యులు, వ్యాపారులు, నాయకులు పాల్గొన్నారు.

# సీఎం పొంగులేటినా.. లేక రేవంతా..



**వరంగల్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ కాంగ్రెస్‌లో పరకాల అసెంబ్లీ సెగ్మెంట్ పాలిటిక్స్ భగ్గుమంటున్నాయి. వచ్చే ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి తాజా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మ-రోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఇటీవల జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరడం ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చర్చగా మారిన వేళ సీఎం రేవంత్ రెడ్డి టార్గెట్‌గా మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. పరకాలలలో రేవూరి ప్రకాశ్ రెడ్డి పోటీ చేస్తారని రేవంత్ రెడ్డి ఎలా ప్రకటిస్తారని? పరకాలలో రేవూరి ఎవరికైనా తెలుసా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉండగా అప్పుటే ఎలా అభ్యర్థిని ప్రకటిస్తారని నిలదీశారు. కొండా మురళిని రేవంత్ రెడ్డి ఎందుకు తొక్కుతున్నారు? కొండా మురళి మామూలు లీడర్ కాదు. కింగ్ మేకర్ అని అన్నారు. రేవంత్ రెడ్డికి పీసీసీ చీఫ్ ఇవ్వాలని కాంగ్రెస్‌లో మొదట అడిగింది కొండా దంపతులేనని గుర్తు చేశారు. పీసీసీ చీఫ్ కాగానే రేవంత్ రెడ్డి మాఇంటికి వచ్చారా లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ గెలిచినా గెలవకపోయినా కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చి ఇంత వరకు కొండామురలికీ ఎందుకు ఎమ్మెల్సీ ఇవ్వలేదని నిలదీశారు.

**పూటకో మాట ఎందుకు?**

ఓవైపు జెన్ జీలకు టికెట్లు ఇవ్వాలని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి.. మరో వైపు డైపర్లు వేసుకుని తిరుగుతున్న రేవూరి ప్రకాశ్ రెడ్డికి మళ్లీ టికెట్ ఇస్తానంటే ఇదేందని నిలదీశారు. సంగారెడ్డిలో జగ్గారెడ్డి టికెట్ అధిష్టానం నిర్ణయిస్తుందని చెప్పిన ముఖ్యమంత్రి.. పరకాల టికెట్ మాత్రం తానే ఎలా నిర్ణయిస్తారు? రేవంత్ రెడ్డి పూటకో మాట ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. 'గుర్తు పెట్టుకో రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీలో టికెట్లు అధిష్టానం నిర్ణయిస్తుంది తప్ప నేతలు కాదు. సీఎం కుర్చీ కాపాడుకోవాలంటే నిబద్ధత ఉండాలి' అని హాట్ కామెంట్స్ చేశారు. కొండగల్‌లో రేవంత్ రెడ్డి ఓ సారి ఓడిపోలేదా? బీసీలంటే రేవంత్ రెడ్డికి ఎందుకంత చులకనా అని ప్రశ్నించారు. ఈ మూడేళ్లలో వేం నరేందర్ రెడ్డి రేవంత్ రెడ్డికి ఏం సలహాలు ఇచ్చారు? వాటిలో రేవంత్ రెడ్డి ఏం పాటించారో చెప్పాలన్నారు.

**ముఖ్యమంత్రి మీరా లేక అతనా?:**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఉద్దేశించి పరోక్షంగా స్పందించిన సుస్మితా.. రేవంత్ రెడ్డితో పాటు ఓ పొంగు ఉందని ఆ పొంగు ఎక్కువ సేపు పొంగదని మీరు ముఖ్యమంత్రో లేక ఆయన ముఖ్యమంత్రో తెలియడం లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మొన్న హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తుంటే ముఖ్యమంత్రి ఫోటోతో పాటు పొంగులేటి ఫోటో వేసుకున్నారు కానీ హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోటో వేయలేదని బీసీలంటే మీకు అంత చులకనా అని ప్రశ్నిచారు.

**సుస్మిత ఆగ్రహం వెనుక..**

కొండా సుస్మితా కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అంతర్గత వివాదాలపై గతంలోనూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో పరకాల నియోజకవర్గం నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహించి మంత్రిగా కొనసాగిన కొండా సురేఖ ప్రస-్తుతం వరంగల్ తూర్పు నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ మంత్రిగా కొనసాగుతున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి పోటీ చేసేందుకు కొండా సుస్మితా ఆసక్తి చూపుతున్నారు. ఈ మేరకు తన పోటీ విషయాన్ని గతంలోనే అమె అనౌన్స్ చేశా-రు. ఈ క్రమంలో ఇటీవల ఉమ్మడి వరంగల్ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మరోసారి భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సీఎం చేసిన ఈ వ్యాఖ్యలు కొండా వర్గాన్ని ఆగ్రహం తెప్పించాయి. ఈ క్రమంలో ఇవాళ కొండా సురేఖ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని మాట్లాడిన సుస్మితా పై విధంగా రియాక్ట్ అయ్యారు.

## సంపాదకీయం




# విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

తెలంగాణ ఇంజినీరింగ్ విద్యార్థుల నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలకు సిద్ధంగా ఉన్న తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో చర్చకు దారితీశాయి. విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు అవసరాన్ని ప్రస్తావించడం తప్పు కాదు. మారుతున్న సాంకేతిక ప్రపంచంలో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా యువత తమను తాము తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. అయితే, ఈ సమస్యకు మూలకారణాలను విశ్లేషించకుండా విద్యార్థుల సామర్థ్యాన్నే ప్రశ్నించడం మాత్రం సమర్థనీయం కాదు. ముఖ్యంగా లక్షలాది మంది యువతను ప్రభావితం చేసే వ్యాఖ్యలు చేసే సమయంలో బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న నాయకులు మరింత సంయమనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది.ఒక విద్యార్థికి ఉద్యోగ ప్రకటనను ఎలా పరిశీలించాలో, దరఖాస్తు ప్రక్రియ ఎలా ఉంటుందో తెలియకపోవచ్చు. మరొకరికి కమ్యూనికేషన్ నైపుణ్యాలు తక్కువగా ఉండొచ్చు. ఇంకొకరికి సాంకేతిక పరిజ్ఞానం ఉన్నప్పటికీ ఇంటర్వ్యూలో తన ప్రతిభను వ్యక్తపరచడం కష్టంగా ఉండవచ్చు. ఇవన్నీ విద్యా వ్యవస్థలో, సామాజిక పరిస్థితుల్లో, కుటుంబ నేపథ్యాల్లో, అందుబాటులో ఉన్న అవకాశాల్లో ఉన్న తేడాల వల్ల ఏర్పడే సమస్యలు. వాటిని గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు విద్యాసంస్థలు, పరిశ్రమలు, విద్యార్థులపైనా ఉంటుంది. కానీ కొందరిలో ఉన్న లోపాలను మొత్తం విద్యార్థి సమాజానికి ఆపాదించడం మాత్రం సరికాదు.తెలంగాణ విద్యార్థుల ప్రతిభను ఒక్కసారి ప్రపంచస్థాయిలో పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి మరింత స్పష్టమవుతుంది. దేశంలోని ప్రముఖ ఐటీ సంస్థలు, బహుళజాతి కంపెనీలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థల్లో తెలంగాణకు చెందిన యువత కీలక స్థానాల్లో ఉన్నారు. అమెరికా, యూరప్, గల్ఫ్ దేశాలతో పాటు ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో తెలుగు ఇంజినీర్లు తమ ప్రతిభను చాటుతున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంతో పాటు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అనేక రంగాల్లోనూ మన యువత పనిచేస్తోంది.వీరిలో చాలామంది విదేశీ విద్యా వ్యవస్థలో పుట్టినవారు కాదు. తెలంగాణలోని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుకుని, పరిమిత వనరులతోనే తమ ప్రతిభను నిరూపించుకున్నవారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు సాధిస్తున్నారు. కాబట్టి తెలంగాణ విద్యార్థులందరికీ నైపుణ్యాలు లేవన్న భావన కలిగించే వ్యాఖ్యలు వారి విజయాలను చిన్నచూపు చూసినట్టవుతాయి.అయితే విద్యా వ్యవస్థలో లోపాలు లేవని చెప్పడం కూడా వాస్తవాన్ని విస్మరించడమే అవుతుంది. రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్య నాణ్యతపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష చేయాల్సిన అవసరం ఉంది. కొన్ని కళాశాలల్లో మౌలిక వసతుల కొరత, నిపుణులైన అధ్యాపకుల కొరత, పరిశ్రమలతో తగిన అనుసంధానం లేకపోవడం, ప్రాక్టికల్ శిక్షణకు తక్కువ ప్రాధాన్యం, పాతబడిన పాఠ్యాంశాలు వంటి సమస్యలు ఉన్నాయా అన్నది పరిశీలించాలి. విద్యార్థుల నైపుణ్యాలను ప్రశ్నించే ముందు ఈ అంశాలపై ప్రభుత్వాలు సమాధానం చెప్పాలి.ఒక విద్యార్థి నాలుగేళ్లు ఇంజినీరింగ్ చదివి బయటకు వచ్చిన తర్వాత ఉద్యోగానికి అవసరమైన ప్రాథమిక నైపుణ్యాలు కూడా లేకపోతే, అందుకు విద్యార్థిని మాత్రమే బాధ్యుడిని చేయడం సరికాదు. విద్యాసంస్థ ఏం నేర్పింది? అధ్యాపకులకు తగిన శిక్షణ ఉందా? ప్రయోగశాలలు ఎలా ఉన్నాయి? పరిశ్రమలతో ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు ఉన్నాయా? పాఠ్యాంశాలు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉన్నాయా? వంటి ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి. వ్యవస్థలో ఉన్న లోపాలను సరిచేయకుండా చివరికి విద్యార్థులనే తప్పుపట్టడం సమస్యకు పరిష్కారం కాదు.ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధిని నిజంగా ప్రాధాన్యంగా తీసుకుంటే అనేక నిర్మాణాత్మక చర్యలు చేపట్టవచ్చు. ప్రతి ఇంజినీరింగ్ కళాశాలలో పరిశ్రమలతో అనుసంధానమైన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక రంగాల్లో ఉచిత లేదా తక్కువ ఖర్చుతో శిక్షణ అందించాలి. కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లిష్ ప్రావీణ్యం, రెజ్యూమ్ తయారీ, ఉద్యోగ దరఖాస్తు విధానం, ఇంటర్వ్యూ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి.ముఖ్యంగా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి అవసరం. నగరాల్లోని విద్యార్థులకు లభించే అవకాశాలు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా అందాలి. ఆన్‌లైన్ శిక్షణ, డిజిటల్ ల్యాబ్‌లు, వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమ నిపుణులతో మెంటరింగ్ కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకురావాలి. అప్పుడు మాత్రమే నైపుణ్యాల విషయంలో ఉన్న అంతరాన్ని తగ్గించగలం.అదే సమయంలో విద్యార్థులకూ బాధ్యత ఉంది. డిగ్రీ సాధించడం మాత్రమే తమ లక్ష్యం కాదని యువత గుర్తించాలి. ఉద్యోగ మార్కెట్ వేగంగా మారుతోంది. ఒకసారి నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానంతో జీవితాంతం కొనసాగడం సాధ్యం కాదు. నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవాలి. కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంచుకోవాలి. ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, ఆన్‌లైన్ కోర్సుల ద్వారా అనుభవాన్ని సంపాదించాలి. తమ రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యల విషయంలో మరో ముఖ్యమైన అంశం నాయకత్వ బాధ్యత. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి చేసే ప్రతి వ్యాఖ్య వేలాది మంది యువతపై ప్రభావం చూపుతుంది. లోపాలను ఎత్తిచూపడం తప్పు కాదు. కానీ ఆ విమర్శలు విద్యార్థుల్లో నిరాశను కలిగించకుండా, మార్పు కోసం ప్రేరణ కలిగించేలా ఉండాలి. “మీకు ఏమీ రాదు” అనే సందేశం కంటే “మీ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాలి.. అందుకు ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది” అనే సందేశం యువతకు ఎంతో ఉపయోగకరం.తెలంగాణ విద్యార్థులు సమస్యలో భాగం కాదు.. పరిష్కారంలో భాగస్వాములు. వారికి అవకాశాలు, నాణ్యమైన విద్య, సరైన శిక్షణ, పరిశ్రమలతో అనుసంధానం కల్పిస్తే ప్రపంచస్థాయిలో మరింత మెరుగ్గా రాణించే సామర్థ్యం వారికి ఉంది. ప్రభుత్వం చేయాల్సింది వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడం కాదు; వారి ప్రతిభకు సరైన వేదికను నిర్మించడం.అందుకే ఇంజినీరింగ్ విద్యార్థుల నైపుణ్యాలపై చర్చను రాజకీయ విమర్శల స్థాయిలో కాకుండా విద్యా సంస్కరణల దిశగా తీసుకెళ్లాలి. కళాశాలల నాణ్యతను పెంచాలి. అధ్యాపకుల సామర్థ్యాన్ని మెరుగుపరచాలి. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలను మార్చాలి. విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్, కమ్యూనికేషన్, సాంకేతిక నైపుణ్యాలు అందించాలి. అదే సమయంలో వారి విజయాలను గుర్తించి ప్రోత్సహించాలి.విద్యార్థులను బోనులో నిలబెట్టి విద్యా వ్యవస్థ బలపడదు. వ్యవస్థను సరిదిద్దితేనే విద్యార్థుల సామర్థ్యం మరింత వెలుగులోకి వస్తుంది. తెలంగాణ యువతను నిందించడం కాదు.. వారికి నమ్మకం, నైపుణ్యం, అవకాశాలు కల్పించడం ప్రభుత్వ అసలు బాధ్యత.

# సూపర్ ముప్పు

## ఎల్‌నినో సూపర్ ఎల్‌నినోగా విరుచుకుపడుతోందా..?

పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతుండటంతో.. కొనసాగుతున్న ఎల్‌నినో అసాధారణంగా తీవ్రంగా మారుతున్నట్లు పలువురు అంతర్జాతీయ శాస్త్రవేత్తలు, వాతావరణ సంస్థలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామం వేగంగా అభివృద్ధి చెందడం, ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రభావాలు చూపే అవకాశం ఉండటంతో కొందరు దీనిని సూపర్ ఎల్‌నినోగా అభివర్ణిస్తున్నారు. అయితే ఈ పదం ప్రామాణిక వాతావరణ వర్గీకరణలో భాగం కాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఐఎండీ వివరాల ప్రకారం.. ఈ ఏడాది జూన్‌లో బలహీన స్థాయిలో ఎల్‌నినో పరిస్థితులు మొదలయ్యాయి. జూలై నాటికి ఇవి మోస్తరు స్థాయికి చేరుకున్నాయి. అక్టోబర్ నుంచి డిసెంబర్ 2026 మధ్య ఎల్‌నినో ప్రభావం మరింత బలపడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ సమయంలో ఎల్‌నినో అత్యంత బలమైన కేటగిరీకి చేరుకోవచ్చని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. అంతేకాదు ఈ సూపర్ ఎల్‌నినో వచ్చే ఏడాది మార్చి వరకూ కొనసాగుతుందనే విశ్లేషణలు.. మరింత గడ్డు పరిస్థితుల్ని కళ్లకు కడుతున్నాయి.ప్రభుత్వం సూపర్ ఎల్‌నినో అనే పదానికి అధికారిక గుర్తింపు లేదని స్పష్టం చేసినప్పటికీ.. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో బలపడుతున్న సంకేతాలు ఇప్పటికే కనిపిస్తున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో దీర్ఘకాలిక ఉష్ణతరంగాలు, కరువు, అడవి మంటలు, వర్షపాతంలో అసాధారణ మార్పులు ఇప్పటికే నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో.. 150 ఏళ్ల క్రితం వచ్చిన సూపర్ ఎల్‌నినోను శాస్త్రవేత్తలు గుర్తుచేసుకుంటున్నారు. అయితే అప్పట్లో అది సూపర్ ఎల్‌నినో అని ముందు తెలియలేదు. తీరా ప్రకృతి విపత్తు విరుచుకుపడి.. భారీ నష్టం చేశాకే.. అది సూపర్ ఎల్‌నినో అని నిర్ధారణ అయింది. ఇంకా వివరంగా చెప్పాలంటే.. అది 1876-78 మధ్య కాలం. వానాకాలంలో సరైన వర్షాలు పడక పంటలు ఎండిపోయాయి. మండే ఎండలతో నదులు ఇంకిపోయాయి. తాగడానికి చుక్కనీరు దొరుకని దుస్థితి. పళ్లెంలో మెతుకు గగనమై పోయింది. మొత్తంగా ఏదో మహమ్మారి విరుచుకుపడ్డట్టు ప్రపంచ దేశాలు అతలాకుతలమైపోయాయి. కరువు రక్కసి దెబ్బకు తాళలేక ప్రజలు పిట్టల్లా రాలిపోయారు. ఆ ఉత్పాతంలో భారత్‌లో 96 లక్షల మంది, ప్రపంచవ్యాప్తంగా 5 కోట్ల మంది తిండిలేక మృత్యువాతపడ్డారు. ప్రజల ప్రాణాలు బలి తీసుకొన్న ఆ ప్రకృతి విలయాన్నే సూపర్ ఎల్‌నినోగా పరిశోధకులు పిలుస్తున్నారు. ఇప్పుడు కూడా రాబోయే రోజుల్లో ఇలాంటి పరిస్థితులు రావచ్చనే అంచనాలు అందర్నీ భయపెడుతున్నాయి.సూపర్ ఎల్‌నినో గురించి తెలుసుకోవాలంటే ముందుగా ఎల్‌నినో గురించి తెలుసుకోవాలి. భూమధ్యరేఖ వెంబడి దక్షిణ అమెరికా ఖండం పశ్చిమతీరం వైపు పెరూ, ఈక్వెడార్ దేశాల సమీపంలో పసిఫిక్ మహా సముద్రజలాలు విస్తరించి ఉంటాయి. ఈ జలాలు అతిగా వేడెక్కితే, సముద్రగాలులు పశ్చిమానికి బదులు తూర్పునకు పయనిస్తాయి. దీంతో భారత్ వంటి ఆసియా దేశాల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితినే ఎల్‌నినో అంటారు. సముద్రపు ఉష్ణోగ్రతలు 0.5 డిగ్రీల సెల్సియస్ వరకూ పెరుగడం సాధారణంగా జరిగేదే. అయితే ఈ ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా పెరిగితే అది సూపర్ ఎల్‌నినోకు దారితీస్తుంది. ఫలితంగా భారత్ సహా పశ్చిమాసియా దేశాల్లో అనావృష్టి తాండవిస్తుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో పసిఫిక్ మహా సముద్రపు ఉపరితల జలాలను పరిశీలించగా, మరోమారు అత్యధిక స్థాయికి ఉష్ణోగ్రతలు చేరినట్టు వెల్లడైంది. ఇది గతంలోని బెంచ్ మార్క్ కన్నా 1.43 డిగ్రీల సెల్సియస్ మేర ఎక్కువగా నమోదైనట్టు తేలింది. ఈ ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరుగుతూ పోయాయి. జులై చివరినాటికి ఈ ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల సెల్సియస్‌కు చేరాయి. ఈ పరిణామమే సూపర్ ఎల్‌నినోకు దారితీసిందని అంచనా. ఐఎండీ తాజా అంచనాల ప్రకారం ఈ ఏడాది వర్షపాతం దీర్ఘకాలిక సగటులో కేవలం 92 శాతమే ఉండొచ్చని తేలింది. అందుకు తగ్గట్టుగానే ఇప్పటిదాకా కంటితుడుపు వర్షాలే తప్ప.. సాగుకు పనికొచ్చే వాన పడలేదు. దీనికి తోడు అల్పపీడనాలు కూడా తుపాన్లుగా మారకముందే బలహీనపడుతూ నిరాశపరుస్తున్నాయి.మన దేశానికి ఎల్‌నినో పరిస్థితులు కొత్త కాదు. 2015లో ఎల్‌నినో ఎఫెక్ట్ వచ్చినప్పుడు జూన్‌లో తీవ్ర ప్రభావం చూపించింది. మొదట్లో కాస్త వర్షాలు కురిసినా రానురాను వాతావరణం పొడిగా మారింది. ఈ ఏడాది కూడా ఆలస్యంగా జులైలో మొదలైన వానలు.. మునుపటిలాగే కాస్త మురిపించి మళ్లీ ముఖం చాటేశాయి. అందుకే ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగకపోగా.. మరింతగా అడుగంటుతున్నాయి. అంతేకాదు గతానికి భిన్నంగా వర్షాకాలంలో వేసవిని మించి విద్యుత్ వినియోగం నమోదవుతోంది. దేశంలో 1997లోనూ శక్తిమంతమైన ఎల్‌నినో ఏర్పడింది. ఆ సమయంలో పసిఫిక్ మహా సముద్ర జలాల ఉష్ణోగ్రతలు 2 డిగ్రీలకు మించాయి. అప్పుడే భారత్‌లోని ఉత్తరాది, మధ్య రాష్ట్రాలపై ప్రభావం గట్టిగా పడింది. అయితే ఈ సారి అంతకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉండడం వల్ల పలు రాష్ట్రాల్లో కరవు సంభవించే అవకాశాలు ఉన్నాయి.ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం సమానంగా ఉండదు. కొన్ని ప్రాంతాల్లో సాధారణ లేదా అధిక వర్షాలు పడినా, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన కొరత ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా మధ్య భారత్‌లో పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. వర్షపాతం తగ్గితే వ్యవసాయం, గ్రామీణ ప్రాంతాల నీటి సరఫరా, స్థానిక ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా ఖరీఫ్ పంటలపై ప్రభావం అధికంగా ఉండొచ్చు. తక్కువ వర్షాలు కేవలం వ్యవసాయానికే కాదు, పర్యావరణానికి కూడా ముప్పు అందని నిపుణులు అంటున్నారు. అడవుల్లో తేమ తగ్గడం, వాగులు, నదులు ఎండిపోవడం, పక్షుల వలసలు, జంతువుల జీవన చక్రాలు దెబ్బతినడం వంటి సమస్యలు వస్తాయని చెబుతున్నారు. ఇప్పటివరకు ఎల్‌నినో పరిస్థితులు.. పడిన వర్షాలను విశ్లేషిస్తే.. కేవలం కొన్ని రాష్ట్రాల్లోనే కంటి తుడుపు వర్షం పడింది. పలు రాష్ట్రాల్లో చినుకు జాడలేదు. దీంతో ప్రభుత్వాలన్నీ సాగునీటి సంగతి వదిలేసి.. తాగునీటి సమస్య రాకుండా జాగ్రత్తపడుతున్నాయి. సాగుకు నీరందించే దిశగా ఎవరూ ఆలోచించడం లేదు. ఎలాగూ సాగునీటిపై ఆశలు వదులుకోవాలని ముందే రైతుల్ని అప్రమత్తం చేసిన ప్రభుత్వాలు.. వచ్చే నైరుతి వరకు తాగునీటికి కటకట లేకుండా ప్రణాళికలు రూపొందించుకోవడంలో నిమగ్నమయ్యాయి. ప్రాజెక్టుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని ఫిక్సౌతున్నాయి. శాస్త్రవేత్తలైతే తీవ్రస్థాయి హెచ్చరికలే జారీ చేస్తున్నారు. అసలిప్పటిదాకా ఎల్‌నినో చూపించింది ట్రైలరేనని.. త్వరలోనే సూపర్ ఎల్‌నినో సినిమా మొదలౌతుందని భయపెడుతున్నారు.మునుపెన్నడూ చూడని విధంగా ఈ వేసవిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భూమిపైనే అత్యంత వేడి దేశంగా భారత్ రికార్డులకెక్కింది. ప్రస్తుతం ప్రపంచంలోని అత్యంత వేడి నగరాల జాబితాలో ఉన్న 100 నగరాలు భారత్‌కు చెందినవే. సూపర్ ఎల్‌నినో ఏర్పడే పరిస్థితులు అంతకంతకూ పెరుగుతుండటం అన్నదాతలకు కొత్త భయాలను తీసుకొస్తోంది. ఖరీఫ్ లోనే దేశంలో 65-70 శాతం వరకూ ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉంది. సూపర్ ఎల్‌నినో కారణంగా ఈసారి ఖరీఫ్‌లో సరైన వర్షాలు పడలేదు. ఇకపై పరిస్థితి మరీ క్లిష్టంగా ఉంటుందనే సూచనలు ఇప్పటికే కనిపిస్తున్నాయి. ఫలితంగా లక్షలాది మంది రైతులు గడ్డు పరిస్థితులను ఎదుర్కోనున్నట్టు హెచ్చరిస్తున్నారు. సరైన వానలు లేక ధాన్యం దిగుబడి గణనీయంగా పడిపోయి దేశంలో ఆహార సంక్షోభం కూడా తలెత్తే ప్రమాదం ఉన్నదని మరికొందరు అంచనా వేస్తున్నారు. దిగుబడి రాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే యుద్ధాలతో పతనమైన ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలపై సూపర్ ఎల్‌నినో దెబ్బ మరింత గట్టిగా పడనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.మే మూడోవారం వరకు ఉన్న అంచనాల ప్రకారం.. సూపర్ ఎల్‌నినో కారణంగా పంజాబ్, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలో తీవ్ర కరువు తలెత్తే ప్రమాదం ఉంది. ఢిల్లీ, తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాల్లోనూ వానలు అంతంత మాత్రంగానే పడొచ్చని, సూపర్ ఎల్‌నినో ప్రభావం ఈ రాష్ట్రాలపైనా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. తమిళనాడు, ఏపీ వంటి తీర ప్రాంత రాష్ట్రాల్లో సూపర్ ఎల్‌నినో కారణంగా అధిక వర్షపాతం కురిసే అవకాశం ఉన్నట్టు నిపుణులు చెప్తున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితి, ఇప్పటిదాకా కురిసిన వర్షపాతాన్ని గమనంలోకి తీసుకుంటే.. గతంలో వేసిన అంచనాలకు మించిన నష్టం తప్పదనే ఆందోళన కనిపిస్తోంది. ఇంకా చిత్రంగా వర్షం పడ్డా కూడా పంటలకు ఉపయోగం లేకుండా కురుస్తుండటం.. రైతుల్ని మరింత దిగాలు పడేలా చేస్తోంది. దిగుబడులు బాగా రావాలంటే కేవలం వర్షం పడితే సరిపోదు. అదనులో వాన కురవాలి. కానీ ప్రస్తుతం దేశంలో ఎక్కడా సరైన సమయంలో సరైన వర్షం పడని మాట నిజం. కాబట్టి పంటలపై ఆశలు పెట్టుకునే పరిస్థితులు పెద్దగా కనిపించడం లేదు. ఎక్కడైనా పంటలు పండినా.. అవి అదృష్టవశాత్తు పండాల్సిందేననే అంచనాలు కలవరపరుస్తున్నాయి. అదే జరిగితే ఇప్పటిదాకా దేశానికి పెట్టని కోటలా నిలబడ్డ సాగు రంగం.. సంక్షోభంలో పడిపోయే ప్రమాదం కనిపిస్తోంది. తద్వారా మొత్తంగా గ్రామీణ భారతమే పెను ప్రమాదంలోకి జారిపోయే అవకాశాలున్నాయి. ఈ దుర్భర పరిస్థితి రూరల్ ఎకానమీని బాగా దెబ్బతీయటమే కాకుండా.. ఈ ఎకానమీపై ఆధారపడ్డ దేశంలోని మిగతా రంగాల్ని దెబ్బతీసి.. చివరకు జీడీపీ గణాంకాలపై గణనీయ ప్రభావం ఖాయమే.ప్రపంచ వాతావరణ సంస్థ సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై కీలక హెచ్చరిక జారీ చేసింది. రానున్న వారాల్లో ఎల్‌నినో ప్రభావం మరింత బలపడే అవకాశం ఉందని, అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొనే అవకాశముందని పేర్కొంది. దేశంలో కొన్ని రోజులపాటు కురిసే అతిభారీ వర్షాలు వారాలు, నెలల తరబడి నెలకొన్న వ్యవసాయ, నీటి ఒత్తిడిని తగ్గించలేవనీ, వరదలను మాత్రమే తీసుకువస్తాయనేది నిష్ఠుర సత్యం. సూపర్ ఎల్‌నినో అభివృద్ధి చెందుతున్నందు వల్ల మున్ముందు భయంకరమైన ఉష్ణోగ్రతల ప్రభావం తప్పకపోవచ్చు. ఇప్పటికే వర్షాకాలం మొదలై రెండున్నర నెలలు గడిచినా.. రాత్రి ఉష్ణోగ్రతలు ఇంకా అదుపులోకి రాలేదు. అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్రపంచకప్ మ్యాచ్‌లు చూసిన వారెవరైనా ఈ ఏడాది దేశంలో రుతుపవనాలను అర్థం చేసుకోవచ్చు. చాలా సమయం వరకు ఎలాంటి గోల్స్ రావు, ఆలస్యంగా గోల్స్ వచ్చి మొత్తం స్కోరు పరిస్థితే మారిపోతుంది. ప్రస్తుతం రుతుపవనాలు కూడా ఇలాగే ఉన్నాయి. సాధారణ వర్షపాతంకంటే జూన్‌లో 40శాతం లోటు రికార్డయ్యింది. జులై ఆరంభంలో కొన్నిచోట్ల బాగా వర్షాలు కురిశాయి. పశ్చిమ కనుమల్లో కేవలం 48 గంటల్లో వెయ్యి మి.మీ. వర్షపాతం నమోదైంది. జాతీయ సగటు లోటు 14శాతానికి పడిపోయింది. అయినా వర్షాభావ పరిస్థితులు పోలేదు. లోటు పెరిగి జులై మధ్యనాటికి 25శాతానికి వచ్చింది. జాతీయ సగటు ప్రాంతీయంగా ఉన్న భిన్న పరిస్థితులను మరుగున పడేస్తోంది. జులై 20 నాటికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు సాధారణ వర్షపాతం కంటే 31శాతం లోటుతో ఉన్నాయి. తెలంగాణలో 31 జిల్లాల్లో లోటు ఉంది. పది జిల్లాల్లో 40శాతానికి మించి లోటు కనిపిస్తోంది. ఏపీలోని 26 జిల్లాలకు 19 జిల్లాల్లో లోటు వర్షపాతం రికార్డయ్యింది. పశ్చిమగోదావరి జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 69శాతం లోటుంది. అన్నమయ్య జిల్లాలో 58శాతం తక్కువగా ఉంది. రాయలసీమలో కనీవినీ ఎరుగని డ్రై స్పెల్ నడుస్తోంది. అకస్మాత్తుగా కొన్ని ప్రాంతాల్లో వచ్చే వర్షాలవల్ల రాష్ట్రవ్యాప్తంగా లోటు తక్కువగా కనిపిస్తున్నా, జిల్లాల మధ్య మాత్రం చాలా అంతరాలున్నాయి. దేశంలో కూడా ఇదే పరిస్థితి.ఈ ఏడాది రుతుపవనాలు విభిన్నంగా ఉన్నాయి. కొన్ని వారాలపాటు చాలా తక్కువ వర్షం పడుతుంది. వెంటనే కొన్ని రోజులు అధిక వర్షపాతం, కుంభవృష్టి ఉంటుంది. వానల కోసం ఎదురుచూస్తున్న కొన్ని ప్రాంతాలు అకస్మాత్తుగా వరదలను, పంట నష్టాన్ని ఎదుర్కొంటాయి. మిగిలిన ప్రాంతాల్లో వర్షాభావం ఉంటుంది. భారీ వర్షాలు జాతీయ సగటును మార్చవచ్చు, కానీ వారాలకొద్దీ వానలు లేకపోవడం వల్ల భూమిలో తేమశాతం, భూగర్భ జలం వెంటనే పెరగవు. వ్యవసాయంలో ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. జులై 17నాటికి 658 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ విత్తనం పడింది. నిరుటి కంటే ఇది ఆరు శాతం తక్కువ. పప్పుధాన్యాలు, ఆయిల్‌సీడ్స్, పత్తి తదితరాల సాగు విస్తీర్ణం తగ్గింది. తెలంగాణలో జులై 14 నాటికి 60లక్షల ఎకరాల్లో మాత్రమే విత్తనం పడింది. వానాకాలంలో సాధారణ విస్తీర్ణం కంటే 45శాతం తక్కువ ఇది. వరి నాట్లు బాగా వెనకపడ్డాయి. ఏపీలో జులై మధ్య నాటికి 8.9 లక్షల ఎకరాల్లో సాగు మొదలైంది. ఇది సాధారణ విస్తీర్ణంలో సుమారు 29శాతం మాత్రమే. ఖరీఫ్ రైతాంగం ఇంకా వర్షం కోసం ఎదురుచూస్తోంది. వానల్లో జాప్యం వల్ల పంటలు ఆలస్యం కావచ్చు. సీజన్‌లో మొత్తం ఎంత వర్షపాతం నమోదైందని కాకుండా వర్షం ఎన్నిసార్లు కురిసింది, అన్ని ప్రాంతాల్లో వచ్చిందా లేదా అన్నది ముఖ్యం. అసలు ఖరీఫ్ సీజన్ దిగుబడులపైనే ఆశల్లేకపోతే.. ఇక రబీ.. కొన్ని ప్రాంతాల్లో మూడో పంట గురించి పూర్తిగా మర్చిపోవాల్సిందే అంటున్నారు నిపుణులు. కాబట్టి రాబోయే ఆహార సంక్షోభానికి సిద్ధం కావడం మినహా మనకు మరో ప్రత్యామ్నాయం లేదనేది నిపుణుల మాట.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com

# బీఆర్ఎస్ అగ్రనేతల హౌస్ అరెస్ట్

## 'సనత్‌నగర్ టిమ్స్' సందర్శనకు పిలుపు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు ప్రతిపక్ష బీఆర్ఎస్ అగ్రనేతలు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు. మాజీ మంత్రులు తన్నీరు హరీశ్ రావు , సబితా ఇంద్రా రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఆస్పత్రి సందర్శనకు వెళ్లకుండా అడ్డుకోవడంతో పాటు పలువురు నేతలను ముందస్తుగా నిర్బంధంలోకి తీసుకున్నారు.

**కోకాపేటలో తీవ్ర ఉద్రిక్తత.. భారీగా మోహరింపు**

సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రికి వెళ్లకుండా నిరోధించేందుకు కోకాపేట్‌లోని మాజీ మంత్రి హరీశ్ రావు నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. హరీశ్ రావు హౌస్ అరెస్ట్ విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కోకాపేట్ లోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఈ క్రమంలో హరీశ్ రావు ఇంటి పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు బీఆర్ఎస్ నేతలకు ఎలాంటి అనుమతి లేదంటూ పోలీసులు దౌర్జన్యంగా అడ్డుకున్నట్లుగా పార్టీ వర్గాలు తెలిపాయి.

**అప్రకటిత ఎమర్జెన్సీపై హరీశ్ రావు ఫైర్**

పోలీసుల అక్రమ నిర్బంధాలు, హౌస్ అరెస్టులపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలు, ఆస్పత్రుల్లోని డొల్లతనం ఎక్కడ బయటపడతాయోనన్న భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అరెస్టులకు పాల్పడుతోందని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలపై నిలదీస్తే హౌస్ అరెస్టులు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తూ, పోలీసుల నిర్బంధాలతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి సాగునీటి విడుదల



**ధర్మసాగర్,ఫ్లాష్ ఇండియా :** ధర్మసాగర్ రిజర్వాయర్ నక్కల తూము ద్వారా నీటిపారుదల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి సాగునీటిని విడుదల చేశారు. నక్కల తూము నుంచి తొలిసారి సాగునీటిని విడుదల చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు దేవాదుల ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దేవాదుల ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూపకల్పన చేయగా, 3 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించినట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ముఖ్యమంత్రితో చర్చించి నెల రోజులుగా దేవాదులలోని అన్ని రిజర్వాయర్లను నింపేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అన్ని రిజర్వాయర్లలో 50 శాతానికి పైగా నీటి నిల్వలు ఉన్నాయని అన్నారు. దేవాదుల కింద ఉన్న అన్ని రిజర్వాయర్ల నుంచి సాగునీరు విడుదల అవుతుందని, కాలువల ద్వారా వస్తున్న నీటిని రైతులు పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.


**ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తాం**

ధర్మసాగర్, ఘనపూర్, అశ్వరావుపల్లి రిజర్వాయర్ల కింద ఉన్న పాత ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకోసం పంట కాలువలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి నివేదిక తయారు చేయాలని సూచించారు. నెల రోజుల్లోపు కాలువల పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వచ్చే యాసంగి నాటికి రిజర్వాయర్ల కింద ఉన్న పూర్తి ఆయకట్టుకు రెండు పంటలకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. అలాగే నక్కల తూము నుంచి విడుదల చేసిన సాగునీరు చివరి ఆయకట్టు వరకు చేరేలా కాలువల సర్వే, పునరుద్ధరణకు సహకరించేందుకు 10 మంది రైతులతో ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ సీఈ సుధీర్, ఎస్ఈ మంగీలాల్, డీఈలు, ఏఈలు, వివిధ గ్రామాల సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# యూరియా కోసం చెప్పుల క్యూ..

**గంభీరావుపేట,ఫ్లాష్ ఇండియా :** వ్యవసాయ పనులు ఊపందుకున్న నేపథ్యంలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం వద్ద మంగళవారం యూరియా కోసం రైతులు చెప్పులను వరుసగా పెట్టి తమ స్థానాలను కాపాడుకోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గంభీరావుపేట పీఏసీఎస్‌లో ఆన్‌లైన్ ద్వారా 1,132 యూరియా బస్తాలను అందుబాటులో ఉంచడంతో రైతులు పెద్ద ఎత్తున బుకింగ్ చేసుకున్నారు. దీంతో తెల్లవారుజామున 6 గంటల నుంచే రైతులు గోదాం వద్దకు చేరుకుని యూరియా కోసం ఎదురుచూశారు. గోదాం ముందు భారీగా రైతులు చేరుకోవడంతో క్యూలు మరింత పెరిగాయి. గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి ఉండటంతో కొందరు రైతులు తమ చెప్పులను వరుసగా పెట్టి క్యూలో తమ స్థానాలను గుర్తించుకున్నారు. ప్రస్తుతం వరి పంట కీలక దశలో ఉండటంతో యూరియా కోసం రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# స్టేట్ బీజేపీ గ్రూపు పాలిటిక్స్‌పై రాజాసింగ్ సెటైర్లు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ భారతీయ జనతా పార్టీ అంతర్గత వ్యవహారాలు, నాయకుల వైఖరిపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు, బీజేపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణ నేతలకు ప్రాతినిధ్యం లభించకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, నాయకుల తీరుపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. బీజేపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణ నుంచి ఒక్కరికి కూడా అవకాశం ఇవ్వకపోవడంపై రాజసింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేవారు. గతంలో రాష్ట్రానికి చెందిన పెద్ద నాయకులకు జాతీయ స్థాయిలో మంచి పదవులు ఇచ్చారని గుర్తుచేశారు. అయితే, తెలంగాణ బీజేపీలో ప్రతీసారి గ్రూప్ రాజకీయాలు నడుస్తున్నాయని, చిన్న విషయానికి కూడా ఢిల్లీ కి వెళ్లి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. నేతల మధ్య ఉన్న ఈ విభేదాల వల్లే 'తెలంగాణ నాయకులు మారరు' అని అధిష్టానం భావించి ఉండవచ్చని, అందుకే జాతీయ కార్యవర్గంలో చోటు కల్పించలేదని రాజాసింగ్ అభిప్రాయపడ్డారు.

**బెంగాల్ మోడల్ ఫాలో కావాలి..**

దేశంలో ప్రతీ రాష్ట్రంలోనూ బీజేపీని అధికారంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో నితిన్ నబీన్ ఓ సైన్యాన్ని తయారు చేసుకున్నారని రాజాసింగ్ తెలిపారు. ఇప్పటికైనా తెలంగాణ నేతలంతా విభేదాలు మరచి, అందరూ ఒకటేనని నిరూపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పశ్చిమ బెంగాల్ తరహాలో పార్టీ నాయకులంతా ఐక్యమై, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడానికి ఓ యుద్ధంలా పోరాడాలని పిలుపునిచ్చారు. సొంత గ్రూపు రాజకీయాలను పక్కనబెట్టి, రాష్ట్రంలో 'మన రాజ్యం' తీసుకురావడమే ధ్యేయంగా పనిచేస్తేనే పార్టీ అధిష్టానం భవిష్యత్తులో పదవులను కేటాయించే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే రాజాసింగ్ తేల్చి చెప్పారు.

# మాజీ మావోయిస్టు గాదె ఇన్నయ్యకు ఊరట..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఎన్ఐఏ నమోదు చేసిన కేసులో చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మావోయిస్టు నేత, తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య అలియాస్ గాదె ఇన్నా రెడ్డికి తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అదేవిధంగా రూ.25 వేల అదనపు పూచీకత్తుతో రెండు షూరిటీ బాండ్లను సమర్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. బెయిల్ వ్యవధిలో ప్రతి శుక్రవారం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో విచారణాధికారి ఎదుట విధిగా తప్పనిసరిగా హాజరుకావాలని షరతు విధించింది. కాగా, మావోయిస్టు పార్టీ భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో జాతీయ దర్యాప్తు సంస్థ ఆయనపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. గతంలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో మావోయిస్టు నేత కాటా రాంచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ మరణించారు. ఆయన అంత్యక్రియలకు హాజరైన గాదె ఇన్నయ్య ప్రసంగం మావోయిస్టులకు అనుకూలంగా ఉందని, ఉద్యమాన్ని ఉత్తేజపరిచే విధంగా ఉందని ఎన్ఐఏ అభియోగాలు మోపింది. ప్రజలు మావోయిస్టు భావజాలం వైపు ఆకర్షితులయ్యేలా ఇన్నయ్య ప్రసంగం ఉందని ఆరోపిస్తూ.. ఎన్ఐఏ ఆయనపై 'ఉపా చట్టం' కింద కేసు నమోదు చేసి గత సంవత్సరం డిసెంబర్ 21న అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

## పాట ప్రజల హక్కుల పరిరక్షణకు

# గొంతుక కావాలి

### టీయుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ






**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పాట కేవలం వినోదం కోసం మాత్రమే కాదని, అది సమాజాన్ని మేల్కొలపాలని, ప్రజల హక్కుల పరిరక్షణకు గొంతుక కావాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయుడబ్ల్యూజె) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ అన్నారు. "విశ్వజన కళామండలి" సాంస్కృతిక సంస్థకు యాభై యేండ్లు నిండిన సందర్భంలో, సెప్టెంబర్ లో జరిగే స్వర్ణోత్సవాల పోస్టర్ ను, ఇవ్వాళ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొని విరాహత్ అలీ ప్రసంగించారు. యాభై యేండ్ల క్రితం మాస్టార్జీ నెలకొల్పిన దళిత కళామండలి, నేడు విశ్వజన కళామండలిగా రూపాంతరం చెంది, దేశవ్యాప్తంగా విస్తరించడం హర్షనీయమన్నారు. మాస్టార్జీతో, ఈ సంస్థతో తనకు ముప్పై యేండ్ల బంధం ఉందని ఆయన తెలిపారు. సమాజంలో అణగారిన వర్గాల కష్టాలు, అవమానాలు, వివక్ష గురించి మాట్లాడటానికి అనేక ఆంక్షలు ఉన్న రోజుల్లో, మాస్టార్జీ పాటను ప్రజల గొంతుకగా మార్చి, పల్లె పల్లెనా సాంస్కృతిక ఉద్యమం చేసారని విరాహత్ అలీ గుర్తుచేసారు. విశ్వజన కళామండలి కేవలం ఒక కళా సంస్థ మాత్రమే కాదని, అది దళితుల ఆత్మగౌరవానికి వేదికగా, సామాజిక న్యాయానికి గొంతుకగా, అంబేద్కర్ ఆలోచనలకు ప్రచార వేదికగా, అణగారిన ప్రజల చైతన్యానికి ఒక సాంస్కృతిక ఉద్యమంగా తన కార్యకలాపాలను కొనసాగించిందని ఆయన కొనియాడారు. మాస్టార్జీ రచించిన "అందుకో దండాలు... బాబా అంబేద్కరా" గీతం దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొంది, ప్రజల్లో ఎనలేని చైతన్యాన్ని కలిగించిందన్నారు. జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే, బుద్ధుడు, పెరియార్ వంటి సామాజిక సంస్కర్తల ఆలోచనలను కూడా విశ్వజన కళామండలి ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించిందని ఆయన తెలిపారు. కారంచేడు నుంచి చుండూరు వరకు దళితులపై జరిగిన అనేక దాడులపై కళామండలి స్పందించి, బాధితుల బాధను, ఆవేదనను, ఆగ్రహాన్ని పాటగా మలచి సాంస్కృతిక పోరు నిర్వహించించడం అభినందనీయమని విరాహత్ అలీ కొనియాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో విశ్వజన కళామండలి వ్యవస్థాపకులు మాస్టార్జి, స్వర్ణోత్సవాల కమిటీ చైర్మన్ జే.బి.రాజు, విశ్వజన కళామండలి గౌరవ సలహాదారులు తలకొక్కుల రాజు, బీసీ ఉద్యమ నాయకులు నారగోని వెంకటయ్య, దళిత ఉద్యమ నాయకులు నల్ల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# ఒకే ఏజెన్సీకి పనుల బాధ్యత!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ మెట్రో రైల్ రెండో దశ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రాజెక్టు పరిధిలో వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించింది. రెండు లేదా అంతకంటే ఎక్కువ శాఖల భాగస్వామ్యం అవసరమయ్యే ప్రాంతాల్లో పనులను వేర్వేరు ఏజెన్సీలకు అప్పగించకుండా ఒకే ఏజెన్సీకి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. దీంతో పనులు సకాలంలో పూర్తయ్యే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నిర్ణయానికి భాగస్వామ్య శాఖల అధికారులు కూడా అంగీకరించారు. అవసరమైన ప్రాంతాల్లో ఆయా శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. ముఖ్యంగా మియాపూర్‌లో జాతీయ రహదారుల శాఖకు సంబంధించిన ఫ్లైఓవర్‌పై మెట్రో రైలు నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో ఎన్‌హెచ్ఏఐ, మెట్రో రైలు పనులను వేర్వేరు ఏజెన్సీలకు అప్పగించకుండా ఒకే ఏజెన్సీ ద్వారా చేపట్టే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఒకే సంస్థకు బాధ్యత అప్పగించడం ద్వారా వివిధ శాఖల మధ్య సమన్వయం మెరుగుపడి పనులు వేగంగా పూర్తవుతాయని భావిస్తున్నారు.

**122.9 కి.మీ మేర విస్తరణ..**

హైదరాబాద్ మెట్రో రైల్ రెండో దశలో మెంత్తం 122.9 కిలోమీటర్ల మేర ఏడు ప్రతిపాదిత కారిడార్లు ఏర్పాటు కానున్నాయి. ఆయా కారిడార్ల అలైన్‌మెంట్, వాటి ప్రభావ పరిధిలో ఉన్న ఇతర శాఖల ప్రస్తుత, భవిష్యత్ ప్రాజెక్టుల వివరాలను మెట్రో అధికారులు సమావేశంలో వెల్లడించారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి భూసేకరణ, రైల్వే క్రాసింగ్‌లు, నాగోల్ వద్ద మూసీ నది, ఇతర జలాశయాలను దాటడం, గ్యాస్ పైప్‌లైన్లు, విమానాశ్రయ పరిధిలో నిర్మాణాలు వంటి అంశాలపై చర్చించారు. ఎన్‌హెచ్ఏఐ, కేంద్ర రోడ్డు రవాణా శాఖ, రక్షణ శాఖ, జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ, ఆర్అండ్‌బీ తదితర శాఖల నుంచి అవసరమైన అనుమతులు, నిరభ్యంతర పత్రాలు (ఎన్ఓసీలు) పొందాల్సి ఉందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఎలాంటి అవరోధాలు లేకుండా ఆయా శాఖలు వీలైనంత త్వరగా ఎన్ఓసీలు జారీ చేయాలని మెట్రో రైల్ అధికారులు కోరారు.

**ఎన్ఓసీల జారీకి వేగం..**

రెండో దశ మెట్రో పనులకు సకాలంలో అనుమతులు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలను ముమ్మరం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు అవసరమైన ఎన్ఓసీల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ కోరారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు పొందడంతో పాటు ప్రాజెక్టు ఎలాంటి జాప్యం లేకుండా ముందుకు సాగేందుకు ఈ అనుమతులు కీలకమని ఆయన పేర్కొన్నారు. రెండో దశలోని ఏడు ప్రతిపాదిత కారిడార్ల పరిధిలో ఇప్పటికే ఉన్న, కొనసాగుతున్న లేదా ప్రతిపాదిత ప్రాజెక్టులు కలిగిన మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాలతో సచివాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. కేంద్ర పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య శాఖ (డీపీఐఐటీ)కి చెందిన నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ నుంచి ప్రాజెక్టుకు అనుమతి పొందే ప్రక్రియలో భాగంగా ఈ సమావేశం జరిగింది. జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హెచ్ఎంఆర్ఎల్ ఎండీ, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. హైదరాబాద్‌లో మెట్రో విస్తరణ ఆవశ్యకతను సర్ఫరాజ్ అహ్మద్ వివరించారు. ప్రతిపాదిత రెండో దశ కారిడార్లకు సంబంధించిన ఎన్ఓసీలను వీలైనంత త్వరగా జారీ చేయాలని సంబంధిత శాఖలను కోరారు. సమావేశంలో హెచ్ఎంఆర్ఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్, జీహెచ్ఎంసీ, సీఎంసీ కమిషనర్లతో పాటు దక్షిణ మధ్య రైల్వే, రక్షణ, రవాణా, ఎన్‌హెచ్ఏఐ, పౌర విమానయానం, జీహెచ్ఏఐఎల్, డీఓటీ, టీజీఎస్‌పీడీసీఎల్, టీజీఐఐసీ, హెచ్ఎండీఏ, ఉమ్టా, నీటిపారుదల, ఆర్అండ్‌బీ, జీఏఐఎల్, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, రిలయన్స్ సంస్థలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# డా. వైఎస్ఆర్ స్టేట్ మ్యూజియాన్ని సందర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



**కోడేరు/ఉమ్మడి మహబూబ్ నగర్ ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** క్రీ.పూ. 2500 సంవత్సరాల నాటి ఈజిప్షియన్ మమ్మీని పరిశీలించిన మంత్రి జూపల్లి బ్రాంజ్, బుద్ధిస్ట్, శిల్పకళ, ఫిరంగులు, పెయింటింగ్ గ్యాలరీలను పరిశీలించిన జూపల్లి ఇన్నేళ్లుగా నిరాదరణ, నిర్లక్ష్యానికి గురైన మ్యూజియాన్ని పునరుద్ధరిస్తాంమ్యూజియం పునరుద్ధరణకు త్వరితగతిన నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటాం క్రీ.పూ. 2500 సంవత్సరాల నాటి ఈజిప్షియన్ మమ్మీని భద్రంగా సంరక్షిస్తాంజర్మన్ నిపుణుల నివేదిక ఆధారంగా మమ్మీ సంరక్షణకు రూ.82 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు మ్యూజియం పునర్నిర్మాణం, భవన సంరక్షణ, పెయింటింగ్ పనులకు అంచనాలు రూపొందించాలని ఆదేశం వారంలోగా అంచనాలను సమర్పించాలని పురావస్తు శాఖ డైరెక్టర్ డా. అర్జునరావును ఆదేశించిన మంత్రి జూపల్లి కృష్ణా రావు.

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రాఫి దినోత్సవము





**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఈరోజు ప్రపంచ ఫోటోగ్రాఫి దినోత్సవము సందర్భముగా జనగామ ఫోటోగ్రాఫర్ అసోసేశాయేషన్ ప్రతినిధులు జనగాం చేవరస్తా లో Dr అంబేద్కర్ కు పూలమాల వేసినా తరువాత ఫోటోగ్రఫీ జెండా ఆవిష్కరణ జరిగింది. అనంతరము రక్తదాన శిబిరము నిర్వహించినారు. మరియు సీనియర్ ఫోటోగ్రఫార్లకు సన్మానం జరిగింది. తదుపరి అశోసేసియన్ వారు సభ్యత్తం ₹6000/-నుండి ఈరోజునుండి ₹10,000/-పెంచినరు. ఎవరయినా ఫోటోగ్రఫర్ కాలము చేస్తే ₹10,000/- నుండి ₹20,000వరకు ఇచ్చుటకు అసోసేయేసన్ సభ్యులు అంగీకరించినరు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కాముని రాము,పట్టణ ఫోటోగ్రాపీ ఫాండర్ v. లింగమూర్తి,మాజీ అధ్యక్షులు గోలి ప్రకాష్,సీనియర్ ఫోటోగ్రాఫర్లు ముసరం ప్రకాష్, వెంకటేశ్వర్లు,చంద్రిమౌళి, శ్రీనివాస్, సురేష్, మరియు జిల్లా స్థాయి పట్టణ సాధ్యి, మండలస్థాయి ఫోటోగ్రాఫర్లు పాల్గొని విజయంతం చేసినారు. ఎసమావేశం YSR భవన్ బతుమ్మకుంట లొ నిర్వహించినరు.



# దరఖాస్తులకు ఆహ్వానం

**కోడేరు/ నాగర్ కర్నూల్ ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వంగూరు మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాల లో 2026-27 విద్య సంవత్సరానికి గాను ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరములో సిఈసి, ఎంపీహెచ్ఓ కోర్స్ లో మిగిలిపోయిన సీట్ల కు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి అని వంగూరు కస్తూర్బబా గాంధీ ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు,

# మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంపొందించాలి

## పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి



**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జనగామ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడంతో పాటు మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచేందుకు పక్కా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.మున్సిపాలిటీ ఆదాయ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఇంటి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్సుల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కొత్త ఆదాయ వనరులను అన్వేషించి మున్సిపాలిటీని ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు.పట్టణ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వార్డుల వారీగా పారిశుధ్య రూట్ మ్యాప్ రూపొందించి చెత్త సేకరణను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లను రూట్ల ప్రకారం కేటాయించి ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై చెత్త వేసే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఇంటి నిర్మాణ అనుమతులను నిర్ణీత గడువులో జారీ చేయాలని, అనుమతి లేని నిర్మాణాలను ఉపేక్షించరాదని కలెక్టర్ ఆదేశించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ట్రేడ్ లైసెన్సులను ప్రజలకు సకాలంలో అందించాలని సూచించారు.మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని, వార్డు స్థాయిలో చేపడుతున్న పనులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీకి సంబంధించిన పూర్తి సమాచారాన్ని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచి పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్న కలెక్టర్.. ప్రజలు పన్నులను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే జనగామ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.



# విద్యార్థులు డ్రగ్స్,మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**అడవిదేవులపల్లి, ఫ్లాష్ఇండియా ప్రతినిధి :**
అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని రిషి కాన్సెప్ట్ స్కూల్‌లో డ్రగ్స్ ,మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు,విద్యార్థులపై వాటి ప్రభావం మరియు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాల్సిన ఆవశ్యకతపై ఎస్ ఐ వి.శేఖర్ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులకు డ్రగ్స్,మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు,మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా అప్రమత్తంగా ఉండాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎస్ఐ శేఖర్ సూచించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస చారి,ఉపాధ్యాయులు శంకర్, నాగసైదులు,అన్వర్,వెంకన్న, రాజేశ్వరి సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# నల్గొండ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఉబ్బపల్లి నాగరాజు నియామకం...



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఉబ్బపల్లి నాగరాజు నియమితులయ్యారు.పార్టీ కోసం బాల్యం నుంచే స్వయంసేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, అనంతరం బీజేవైఎం,ఎస్సీ మోర్చా విభాగాల్లో వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన ఆయన సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతలను అప్పగించారు.నాగరాజు బాల్యం నుంచే సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం,పార్టీ కార్యక్రమాల్లో చురుకైన భాగస్వామ్యంతో ముందుకు సాగారు.ఈ సందర్భంగా ఉబ్బపల్లి నాగరాజు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ నూకల నరసింహారెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు క్రాంతి కిరణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకురి నరసింహ,ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు బాకీ నరసింహ, మిర్యాలగూడ అసెంబ్లీ ఇన్‌చార్జ్ సాధినేని శ్రీనివాస్, మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.తనకు అప్పగించిన కొత్త బాధ్యతను పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా, పూర్తి అంకితభావంతో నిర్వహిస్తానని నాగరాజు తెలిపారు.నల్గొండ జిల్లాలో ఎస్సీ మోర్చాను మరింత బలోపేతం చేయడంతో పాటు,ఎస్సీ వర్గాల సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.నాగరాజు నియామకం పట్ల మిర్యాలగూడ పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# రైతులు నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను వినియోగించాలి



**మిర్యాలగూడ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**
మిర్యాలగూడ మండల పరిధిలోని చింతపల్లి, కిష్టాపురం గ్రామాల్లో రైతులకు నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది నానో ఎరువుల ఉపయోగాలు, వినియోగించే విధానం, పంటలకు కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. సాంప్రదాయ ఎరువులతో పోలిస్తే నానో యూరియా, నానో డీఏపీ తక్కువ పరిమాణంలోనే పంటలకు అవసరమైన పోషకాలను అందించడంలో ఉపయోగపడతాయని తెలిపారు.రైతులు నానో ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు వినియోగించాలని సూచించారు. నానో ఎరువుల వినియోగంతో ఎరువుల ఖర్చును తగ్గించుకోవడంతో పాటు పంటల నాణ్యత, దిగుబడిని మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందని వివరించారు.కార్యక్రమంలో పాల్గొన్న రైతులు నానో ఎరువుల వినియోగంపై తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. అలాగే సమీకృత తెగులు నిర్వహణలో రసాయన పురుగుమందులపై పూర్తిగా ఆధారపడకుండా జీవ, యాంత్రిక, ఇతర పద్ధతులను సమన్వయం చేసుకుని తెగుళ్లను నియంత్రించవచ్చని రైతులకు వివరించారు.దీని ద్వారా పురుగుమందుల వినియోగం, సాగు ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, మిత్ర పురుగుల సంరక్షణ, పురుగుమందుల నిరోధకత ఏర్పడకుండా నివారించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎం. రుషేంద్రమని, ఏఈఓ పార్వతి, బీటీఎం గిరి, రవి, నాగరాజు, కృష్ణారెడ్డి, లింగనాయక్, రవి, కిరణ్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# లారీ ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభం

**కోదాడ,ఫ్లాష్ ఇండియా :** కోదాడ పట్టణంలోని గుడిబండ రోడ్డులో విద్యుత్ ప్రమాదం పొంచి ఉంది. గురుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొనడంతో స్తంభం విరిగి ప్రమాదకరంగా వాలిపోయి రెండు రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో విద్యుత్ తీగలు రోడ్డుపైకి వేలాడుతూ కనిపిస్తున్నాయి. ముఖ్యంగా 11 కేవీ విద్యుత్ లైన్ కావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదం జరిగిన అనంతరం స్తంభం పూర్తిగా నేలకొరిగే పరిస్థితిలో ఉండటంతోపాటు, దానికి అనుసంధానమైన విద్యుత్ తీగలు కూడా కిందికి వేలాడుతున్నాయి.ఈ మార్గంలో నిత్యం వాహనాల రాకపోకలు, ప్రజల సంచారం అధికంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విరిగిన విద్యుత్ స్తంభాన్ని వెంటనే తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేయడంతోపాటు, వేలాడుతున్న విద్యుత్ తీగలను సురక్షితంగా బిగించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి, అత్యవసర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. 11 కేవీ విద్యుత్ లైన్ కావడంతో చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయంపై విద్యుత్ అధికారులకు ఫోన్ చేయగా స్పందించలేదు.

# బస్సు సర్వీసులు యధావిధిగా కొనసాగిస్తాం



**అడవిదేవులపల్లి, ఫ్లాష్ఇండియా ప్రతినిధి :**
అడవిదేవులపల్లి- మిర్యాలగూడ మధ్య బస్సు సర్వీసుల వేళల్లో మార్పులపై ప్రయాణికులు,విద్యార్థులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై స్పందించిన డిపో మేనేజర్ జి. రామ్మోహన్ రెడ్డి,ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బస్సులను యథావిధిగా పాత సమయాల్లోనే నడిపిస్తామని హామీ ఇచ్చారు.బస్సు సమయాలను యథావిధిగా కొనసాగించాలన్న స్థానికుల విజ్ఞప్తికి డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించడంతో విద్యార్థులు, ఉద్యోగులు,ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# భూముల రీసర్వే పకడ్బందీగా పూర్తి చేయాలి

**రాజన్న సిరిసిల్ల,ఫ్లాష్ ఇండియా :** జిల్లాలో భూముల రీసర్వే పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. భూముల రీసర్వే ప్రక్రియ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. భూముల రీ సర్వే ప్రక్రియ, వివిధ అంశాలపై తహసీల్దార్లకు జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. జిల్లాలో చేపట్టిన భూముల రీసర్వేలో భాగంగా ఇప్పటి వరకు గంభీరావుపేట మండలం శ్రీనివాసపురం, కోనరావుపేట మండలం లచ్చపేట, వేములవాడ మండలం చంద్రగిరి, చందుర్తి మండలం అనంతపల్లి గ్రామాల్లో చేపట్టిన సర్వే పూర్తయిందని అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. ప్రస్తుతం మరో పది గ్రామాల్లో సర్వే మొదలు పెట్టామని తెలిపారు.

**తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి..**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఇప్పటికే సర్వే చేసిన గ్రామాలకు సంబంధించిన రికార్డులు ఆయా మండలాల తహసీల్దార్లకు అందజేయాలని ఆదేశించారు. మిగతా గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ వేగవంతం చేసేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్ళాలని సూచించారు. భూముల వివరాలను క్షేత్ర స్థాయిలో పక్కాగా సేకరించాలని, రోజూ వారీగా లక్ష్యం నిర్దేశించుకుని, రీ సర్వే పూర్తి పారదర్శకతతో చేయాలని సూచించారు. గ్రామాల్లో సర్వే చేసే ముందు జీపీఓలు, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఏ ఏ సర్వే నంబర్ భూముల సమాచారం ముందుగా ఆయా గ్రామాల్లో చేరవేయాలని ఆదేశించారు. గ్రామ సరిహద్దుల రీ సర్వే, ఇతర పనులను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ శాఖల భూముల వివరాలను సంబంధిత శాఖల అధికారులకు అందజేయాలని తెలిపారు. సర్వేకు సంబంధించిన పూర్తి వివరాలు క్షేత్రస్థాయి, రికార్డులలో పరిశీలించిన తర్వాత మిగతా ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# సౌతాఫ్రికాను చిత్తు చేసిన భారత్



హాకీ వరల్డ్ కప్ చరిత్రలో భారత మహిళల హాకీ జట్టు భారీ విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం జరిగిన రెండో గ్రూపు మ్యాచ్‌లో భారత్ 6-1 తేడాతో సౌతాఫ్రికాను మట్టికరిపించింది. తొలి మ్యాచ్‌ను చైనాతో డ్రా చేసుకున్న విషయం తెలిసిందే. సౌతాఫ్రికాపై మాత్రం దూకుడుగా ఆడింది. ఆరంభం నుంచే ఎటాకింగ్‌కు దిగింది. 11వ నిమిషంలో సునెలిటా టొప్పొ ఇండియాకు తొలి గోల్ అందించింది. ఆ తరర్వాత నవ్‌నీత్ కౌర్ 17వ నిమిషంలో, సుశీల 25వ నిమిషంలో చెరో గోల్ చేయడంతో ఫస్టాఫ్‌లో భారత్ 3-0తో ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత కూడా భారత్ జోరు కొనసాగింది. 38వ నిమిషంలో దీపిక, 44వ నిమిషంలో లాల్‌రెమ్సియామి, 45వ నిమిషంలో సాక్షి గోల్స్ చేశారు. దీంతో భారత్ 6-0తో లీడ్‌లోకి దూసుకెళ్లింది. ఆరంభం నుంచి ఇండియా దూకుడు కొనసాగగా.. సౌతాఫ్రికా కళ్లెం వేయలేకపోయింది. మరోవైపు, దక్షిణాఫ్రికా అవకాశాలను భారత డిఫెన్స్ తిప్పికొట్టింది. దీంతో ఆ జట్టు ఒక్క గోల్ చేయడం మినహా ఏం చేయలేకపోయింది. 55వ నిమిషంలో సౌతాఫ్రికా ఏకైక, చివరి గోల్ నమోదు చేసింది. ఈ విజయంతో భారత జట్టు రెండో రౌండ్ అవకాశాలను మెరుగుపర్చుకుంది. ప్రస్తుతం గ్రూపు-డిలో 4 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. శుక్రవారం చివరి గ్రూపు మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌తో తలపడనుంది. రెండో రౌండ్‌కు చేరుకోవాలంటే ఈ మ్యాచ్‌లో గెలవడం తప్పనిసరి.

# ప్రీక్వార్టర్స్‌కు గాయత్రి జోడీ



ఢిల్లీలో జరుగుతున్న బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ ఆటగాడు లక్ష్యసేన్ శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన మెన్స్ సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్యసేన్ 16-21, 21-8, 21-4 తేడాతో ఆస్ట్రియాకు చెందిన కొల్లిన్స్ ఫిలిమోన్‌పై గెలుపొందాడు. మ్యాచ్ ఆరంభంలో అతనికి షాక్ తగిలింది. తొలి గేమును ప్రత్యర్థి గెలిచాడు. ఆ గేములో లక్ష్యసేన్ పోరాడినప్పటికీ నిరాశ తప్పలేదు. అనంతరం సేన్ బలంగా పుంజుకున్నాడు. ప్రత్యర్థి జోరుకు కళ్లెం వేశాడు. మిగతా రెండు గేముల్లో అద్భుతంగా ఆడాడు. అతని దూకుడు ముందు ఫిలిమోన్ కనీసం పోటీ ఇవ్వలేదు. దీంతో సేన్ వరుసగా రెండు గేముల్లో నెగ్గడంతో విజయం అతన్నే వరించింది. రెండో రౌండ్‌లో అతను అమెరికాకు చెందిన గారెట్ టాన్‌తో తలపడనున్నాడు. ఉమెన్స్ సింగిల్స్‌లో యువ క్రీడాకారిణి ఉన్నతి హుడా కూడా రెండో రౌండ్‌కు చేరుకుంది. తొలి రౌండ్‌లో మయన్మార్‌కు చెందిన థెట్ తుజార్‌తో పోటీపడిన ఆమె పోరాడి గెలిచింది. వరుసగా రెండు గేములను 22-20, 21-16 తేడాతో విజయం సాధించింది. ప్రత్యర్థి నుంచి తీవ్ర పోటీ ఎదురవడంతో ఉన్నతి గెలుపు కోసం చెమటోడ్చాల్సి వచ్చింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్-ట్రీసా జాలీ జోడీ జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసి ప్రీక్వార్టర్స్‌కు చేరుకుంది. రెండో రౌండ్‌లో గాయత్రి జంట 21-15, 21-12 తేడాతో అమెరికాకు చెందిన లారెన్ లామ్-ఆలిసన్ లీ ద్వయాన్ని జోడించింది. మరో జంట సెల్వం-సిమ్రాన్ సింఘి జోడీ రెండో రౌండ్‌లో నిష్క్రమించింది. బల్గేరియాకు చెందిన గాబ్రియేలా స్టోవా- స్టెఫానీ స్టోవా జంట చేతిలో 7-21, 14-21 తేడాతో ఓడిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో కూడా భారత్‌కు నిరాశ ఎదురైంది. అసిత్ సూర్య-అమృత జోడీ కూడా పరాజయం పాలైంది. తుర్కియేకు చెందిన సోన్మెజ్-యాసెమెన్ బెక్తాస్‌తో హోరాహోరీగా సాగిన పోరులో భారత షట్లర్లు 21-16, 29-30, 22-24 తేడాతో పోరాడి ఓడిపోయారు. రోహన్ కపూర్-రుత్విక గద్దె ద్వయం కూడా ఓడటంతో మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్ పోరాటం ముగిసింది.



# అగార్కర్‌తో విభేదాలు..

టీమిండియా సీనియర్ బ్యాటర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వన్డే భవిష్యత్‌పై మరోసారి చర్చ మొదలైంది. ఇటీవల ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన మూడో వన్డేలో సెంచరీ చేసిన తర్వాత రోహిత్ తన రిటైర్మెంట్ ఆలోచనను మార్చుకున్నట్లు ఓ నివేదిక పేర్కొంది. ఈ క్రమంలో రోహిత్, బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ మధ్య విభేదాలు తలెత్తినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వార్తలను బీసీసీఐ అధికారికంగా ఇప్పటివరకు ధృవీకరించలేదు. ఇంగ్లండ్ సిరీస్‌కు ముందు రోహిత్ శర్మ వన్డే కెరీర్‌పై బీసీసీఐ సెలెక్టర్లు చర్చించినట్లు సమాచారం. తొలి రెండు మ్యాచ్‌ల తర్వాత తన వన్డే భవిష్యత్‌పై ఆలోచిస్తానని రోహిత్ సెలెక్టర్లకు హామీ ఇచ్చారట. అయితే లార్డ్స్‌లో జరిగిన మూడో వన్డేలో అద్భుత సెంచరీ సాధించడంతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయని పలు నివేదికలు పేర్కొన్నాయి. ఈ ఇన్నింగ్స్ తర్వాత రోహిత్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పే ఆలోచనను మార్చుకున్నాడట. ఇదే సమయంలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో రోహిత్‌కు విభేదాలు తలెత్తినట్లు కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా అగార్కర్‌ను చీఫ్ సెలెక్టర్ పదవి నుంచి తొలగించాలని రోహిత్ కోరినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. మరోవైపు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ జట్టు వ్యవహారాల్లో ఎక్కువగా జోక్యం చేసుకుంటున్నారనే విషయంలో కూడా రోహిత్ శర్మ తన అభ్యంతరాలను వ్యక్తం చేసినట్లు మరో నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) అధిపతి వీవీఎస్ లక్ష్మణ్‌కు టీమ్ మేనేజ్‌మెంట్‌లో మరిన్ని కీలక బాధ్యతలు అప్పగించారట. అయితే రోహిత్ వన్డే భవిష్యత్తుకు ఎలాంటి ప్రమాదం లేదని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. వెస్టిండీస్‌తో స్వదేశంలో జరగనున్న తదుపరి వన్డే సిరీస్‌కు కూడా అతడిని ఎంపిక చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం రోహిత్ వన్డే కెరీర్ సజావుగా సాగనుందట. అయితే రోహిత్ వన్డే భవిష్యత్, అగార్కర్‌తో విభేదాలపై వస్తున్న వార్తలకు బీసీసీఐ నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

# లంక ముందు కొండంత లక్ష్యం..



గాలే వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో భారత జట్టు విజయం దిశగా దూసుకెళ్తోంది. గాల్ అంతర్జాతీయ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ నాలుగో రోజు భారత్ తన రెండో ఇన్నింగ్స్‌లో 193 పరుగులకు ఆలౌటైంది. దీంతో తొలి ఇన్నింగ్స్ లభించిన 178 పరుగుల ఆధిక్యాన్ని కలుపుకొని, శ్రీలంక ముందు 372 పరుగుల క్లిష్టమైన లక్ష్యాన్ని సెట్ చేసింది.

**పడిక్కల్, పంత్ మెరుపులు..**

భారత్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. పంత్ 69 బంతుల్లో 66 పరుగులు సాధించి ఇన్నింగ్స్‌ను వేగవంతం చేశాడు. ఈ క్రమంలోనే ఆయన టెస్టుల్లో తన 100వ సిక్సర్‌ను పూర్తి చేసుకొని అతితక్కువ ఇన్నింగ్స్‌లలో ఈ ఘనత సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. దేవ్‌దత్ పడిక్కల్ (44), కేఎల్ రాహుల్ (35) కీలక పరుగులు జోడించారు. శ్రీలంక బౌలర్లలో లహిరు కుమార 3 వికెట్లు పడగొట్టగా, ప్రభాత్ జయసూర్య, అసిథ ఫెర్నాండో తల రెండు వికెట్లు తీశారు.కాగా, అంతకుముందు, భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో దేవ్‌దత్ పడిక్కల్ (167) అద్భుత శతకంతో పాటు కేఎల్ రాహుల్ (82), ధ్రువ్ జురెల్ (51)ల హాఫ్ సెంచరీల సాయంతో 462 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంకను భారత స్పిన్నర్లు మానవ్ సుతార్ 79 పరుగులు ఇచ్చి 4 వికెట్లు, రవీంద్ర జడేజా 57 పరుగులు ఇచ్చిన 3 వికెట్లు తీసుకుని కోలులోలేని దెబ్బతీశారు. ఒకానొక దశలో 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన లంకను, సొనాల్ దినుష (100) తన తొలి టెస్టు సెంచరీతో, నిరోషన్ డిక్వెల్లా (80)తో కలిసి ఆదుకున్నాడు. లంక తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకు ఆలౌట్ కావడంతో భారత్‌కు 178 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. 372 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకను త్వరగా ఆలౌట్ చేసి, రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లాలని టీమిండియా ఉవ్విళ్లూరుతోంది.

# బిజినెస్



## టాటా సన్స్ ఏజీఎం రద్దు

దేశీయ అతిపెద్ద వ్యాపార దిగ్గజమైన టాటా గ్రూప్‌లో తీవ్ర ఉత్కంఠ వాతావరణం నెలకొంది. సంస్థ నాయకత్వ మార్పు జరుగుతున్న కీలక సమయంలో టాటా సన్స్ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) కోరం లేక రద్దు కావడం కార్పొరేట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. టాటా గ్రూప్ చరిత్రలో ఏజీఎం రద్దవడం ఇదే మొదటిసారి. సర్ రతన్ టాటా ట్రస్ట్ విధించిన కీలకమైన ఆంక్ష వల్ల ప్రతినిధులు హాజరుకాక ఈ సమావేశం రద్దయిందని సమాచారం. టాటా సన్స్ ఛైర్మన్‌గా ఉన్న ఎన్ చంద్రశేఖరన్ తన పదవిలో కొనసాగేందుకు మొగ్గు చూపకపోవడంతో, తదుపరి అధినేతను ఎన్నుకునే ప్రక్రియను సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ వేగవంతం చేసింది. టాటా సన్స్‌లో దాదాపు 66 శాతం వాటా కలిగిన టాటా ట్రస్ట్స్‌కు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న నోయెల్ టాటా, కొత్త ఛైర్మన్ ఎంపికలో అత్యంత కీలక వ్యక్తిగా మారారు. ఇటీవలి బోర్డు సమావేశంలో చంద్రశేఖరన్ గ్రూప్ వ్యాపార వృద్ధి ప్రణాళికలను సమర్పించినప్పుడు, ఎయిర్ ఇండియా, బిగ్‌బాస్కెట్ వంటి విభాగాల్లో వస్తున్న నష్టాలపై నోయెల్ టాటా నేరుగా తన ఆందోళనను వ్యక్తం చేయడం గమనార్హం. 70 ఏళ్ల వయోపరిమితి నిబంధన ప్రకారం ఈ నవంబర్‌లో ట్రెంట్, టైటాన్, టాటా స్టీల్ సహా ఆరు కంపెనీల బోర్డుల నుంచి నోయెల్ టాటా వైదొలుగుతున్నప్పటికీ, నామినీలకు మినహాయింపు ఉండటంతో టాటా సన్స్ బోర్డులో డైరెక్టర్‌గా కొనసాగుతారు. సెమీకండక్టర్లు, ఏవియేషన్ వంటి రంగాలలో విస్తరిస్తున్న టాటా గ్రూపునకు ఈ నాయకత్వ మార్పు అత్యంత కీలకంగా మారింది.



## ఆర్‌బీఐ ప్రణాళికలకు కొత్త సవాళ్లు


దేశంలో యూపీఐ, డిజిటల్ చెల్లింపుల వినియోగం గణనీయంగా పెరిగినప్పటికీ, చలామణిలో ఉన్న కరెన్సీ నోట్ల పరిమాణం ఏమాత్రం తగ్గకపోవడం ఆర్థికవ్యవస్థలో ఆసక్తికరమైన సవాలుగా మారింది. డిజిటల్ చెల్లింపులు వేగంగా పెరుగుతున్నా.. నగదుపై ప్రజలు ఆధారపడటం మాత్రం తగ్గడం లేదు. వ్యక్తిగత లావాదేవీల్లో నగదు వాటా క్రమంగా తగ్గుతున్నప్పటికీ, చలామణిలో ఉన్న కరెన్సీ మాత్రం రెండంకెల వేగంతో పెరుగుతుండటం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)కి కొత్త సవాలుగా మారింది. భవిష్యత్తులో ఎంత నగదు అవసరమవుతుందో అంచనా వేయడం, దానికి అనుగుణంగా నోట్లను ముద్రించడం, దేశవ్యాప్తంగా పంపిణీ చేయడం మరింత క్లిష్టంగా మారుతోందని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ శిరీష్ చంద్ర ముర్ము తెలిపారు. జకార్తాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యంగా గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాలు, తక్కువ ఆదాయ వర్గాలు, వృద్ధులు, చిన్న వ్యాపారాల్లో నగదు ఇప్పటికీ కీలక చెల్లింపు సాధనంగానే ఉందన్నారు. గత కొన్నేళ్లుగా ఆర్‌బీఐ ఆరు డినామినేషన్లలో ఏటా 2.8 కోట్ల నుంచి 3 కోట్ల నోట్లను ఉత్పత్తి చేసి, అందులో సుమారు 2.1 కోట్ల నోట్లను పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం భారత్‌లో 1.76 కోట్ల నోట్లు చలామణిలో ఉన్నాయని శిరీష్ చంద్ర చెప్పారు. తక్కువ విలువైన నోట్ల వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల భారత్‌లో నోట్ల సంఖ్య కూడా సహజంగానే అధికంగా ఉంటుందని ఆయన వివరించారు. అంటే డిజిటల్ పేమెంట్స్ పెరిగినా.. దేశవ్యాప్తంగా నగదును ముద్రించడం, తరలించడం, నిల్వ చేయడం, పాత నోట్లను వెనక్కి తీసుకోవడం వంటి భారీ లాజిస్టిక్స్ వ్యవస్థ మాత్రం కొనసాగాల్సిందే. నోట్ల మన్నికను పెంచి, స్వచ్ఛమైన కరెన్సీని అందించేందుకు గాను 2028 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుండి రూ.10, రూ.20 విలువైన 100 కోట్ల పాలిమర్ నోట్లను పైలట్ ప్రాజెక్ట్‌గా చలామణిలోకి తెచ్చేందుకు ఆర్‌బీఐ సిద్ధవవుతోంది. కరెన్సీ రంగానికి అవసరమైన పేపర్ మిల్లులు, ప్రింటింగ్ ప్రెస్‌లు, ఇంక్ యూనిట్లు పూర్తిగా స్వదేశీ యాజమాన్యంలోనే ఉండటం వల్ల అధిక భద్రతా ప్రమాణాలతో నోట్లను ముద్రిస్తున్నారు. భౌతిక కరెన్సీపై ప్రజలకు నమ్మకం నిలబెట్టడమే కీలకమని, పర్యావరణహిత పద్ధతుల ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించేలా ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటోందని శిరీష్ చంద్ర స్పష్టం చేశారు.

## ఫోన్ల ధరల పెంపునకు బదులు శాంసంగ్ కొత్త ప్లాన్




ప్రపంచవ్యాప్తంగా చిప్ కొరత వల్ల స్మార్ట్‌ఫోన్లతో సహా ఎలక్ట్రానిక్స్ ధరలు పెరుగుతున్న వేళ, వినియోగదారులపై భారం తగ్గించేందుకు శాంసంగ్ తన గెలాక్సీ జీ ఫోల్డ్8 సిరీస్ కోసం 'గెలాక్సీ ఫరెవర్' అనే ఆకర్షణీయమైన ఫైనాన్సింగ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. ఈ ప్లాన్ ద్వారా నెలకు రూ.8,584 (ఫోల్డ్8), రూ.9,417 (ఫోల్డ్8 అల్ట్రా)ల నుంచి ప్రారంభమయ్యే 24 నెలల నో-కాస్ట్ ఈఎంఐతో పాటు ఉచిత 'శాంసంగ్ కేర్ ప్లస్ ' ప్రొటెక్షన్ సులభంగా లభిస్తుంది. అంతేకాకుండా, ఫోన్‌ను తిరిగి ఇచ్చే కాలాన్ని బట్టి (10 నుంచి 25 నెలల మధ్య) గరిష్ఠంగా 55 శాతం వరకు బైబ్యాక్ గ్యారెంటీని ఆఫర్ చేస్తోంది. పెరిగిన ధరల వల్ల ఒకేసారి పెద్ద మొత్తం చెల్లించలేని ప్రీమియం కస్టమర్లను ఆకట్టుకోవడంతో పాటు, వినియోగదారులు త్వరితగతిన తదుపరి గెలాక్సీ మోడళ్లకు అప్‌గ్రేడ్ అయ్యేలా చేయడమే శాంసంగ్ ఈ సరికొత్త ప్యాకేజీ వ్యూహం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి.

## రైలు టికెట్ బుకింగ్‌లోకి ఉబెర్ యాప్




ఇకపై రైలు టిక్కెట్ల కోసం ఒక యాప్, స్టేషన్‌కు వెళ్లే క్యాబ్ కోసం మరో యాప్ ఉపయోగించాల్సిన అవసరం లేదు. ప్రముఖ రైడ్-హెయిలింగ్ దిగ్గజం 'ఉబెర్', ప్రముఖ ఆన్‌లైన్ ట్రావెల్ ప్లాట్‌ఫామ్ 'ఇక్సిగో'తో చేతులు కలిపి తన యాప్‌లోనే నేరుగా రైలు టిక్కెట్లను బుక్ చేసుకునే సరికొత్త సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఇక్సిగోకు ఉన్న అడ్వాన్స్‌డ్ ట్రైన్ బుకింగ్ టెక్నాలజీని ఉబెర్ ఉపయోగించుకోనుంది. ప్రయాణికులు ఇప్పుడు ఉబెర్ యాప్ ద్వారానే రైలు టిక్కెట్లు బుక్ చేసుకోవడంతో పాటు తమ పీఎన్ఆర్ స్టేటస్‌ను సులభంగా తనిఖీ చేసుకోవచ్చు. ప్రతి సంవత్సరం 740 కోట్లకు పైగా ప్రయాణికులను చేరవేసే భారతీయ రైల్వే రంగాన్ని తమ ప్లాట్‌ఫామ్‌కు అనుసంధానించడం ద్వారా, కస్టమర్ల ప్రయాణాన్ని డిజిటల్‌గా అనుసంధానించడమే తమ లక్ష్యమని ఉబెర్ ఇండియా బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అర్నాబ్ కుమార్ వెల్లడించారు.ఈ సరికొత్త ఫీచర్‌తో ఉబెర్ తన సేవలను కేవలం కార్లు, ఆటోలకు మాత్రమే పరిమితం చేయకుండా ఒకే చోట అన్ని రకాల ప్రయాణ సేవలను అందించే 'మల్టీమోడల్ మొబిలిటీ ప్లాట్‌ఫామ్'గా మార్చింది. ప్రయాణికుడు ఇంటి వద్ద బయలుదేరినప్పటి నుండి గమ్యస్థానం చేరుకునే వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సేవలు అందించడంపైనే తాము దృష్టి పెట్టామని ఇక్సిగో సీఈఓ అలోక్ బాజ్‌పాయ్ స్పష్టం చేశారు. బైక్, ఆటో, క్యాబ్, మెట్రో, ఇంటర్‌సిటీ బస్సులతో పాటు ఇప్పుడు రైలు టిక్కెట్లను కలపడం ద్వారా దేశవ్యాప్తంగా ప్రయాణికులకు 'వన్-స్టాప్' సొల్యూషన్‌గా మారాలని భావిస్తున్నట్టు ఉబెర్ పేర్కొంది.




## పెళ్లి అయిన హీరోయిన్ల కెరీర్‌ను తొక్కేస్తున్నారు..

తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సినీ ఇండస్ట్రీలో నటీమణులు ఎదుర్కొంటున్న పరిస్థితులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా పెళ్లి తర్వాత హీరోయిన్ల పట్ల పరిశ్రమ చూపే వివక్షను బయటపెడుతూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.సాధారణంగానే సినిమా రంగంలో పురుషులతో పోలిస్తే నటీమణులే ఎక్కువ సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని, ఈ విషయంలో తనకు కొంత అసంతృప్తి కూడా ఉందని కాజల్ స్పష్టం చేశారు. పరిశ్రమలో ఒక నటికి పెళ్లి కాగానే ఆమె లైఫ్ లేదా కెరీర్ అక్కడితో ముగిసిపోయిందని చాలామంది భావిస్తుంటారని కాజల్ అన్నారు. నటీమణులకు మార్కెట్‌లో మంచి డిమాండ్, క్రేజ్ ఉన్నప్పటికీ.. పెళ్లయ్యాక వారిని ఉద్దేశపూర్వకంగానే పక్కనపెట్టి, వారి కెరీర్‌ను అణచివేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని సంచలన నిజాలు వెల్లడించారు. ఇటువంటి వివక్షతతో కూడిన పరిస్థితులు పరిశ్రమలో త్వరలోనే మారాలని కోరారు. ప్రతిభ ఉన్న నటీమణులకు వయస్సు లేదా పెళ్లి అనేవి ఎప్పటికీ అడ్డంకి కాకూడదని, నిజమైన టాలెంట్ ఉన్న నటీమణులు ఏ వయసులోనైనా అద్భుతంగా నటించగలరని కాజల్ పేర్కొన్నారు. ప్రస్తుతం కాజల్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి.

## చిన్న పిల్లలు 'టాక్సిక్' చూడొద్దు..




కన్నడ స్టార్ హీరో యష్ లేటెస్ట్ గా నటించిన సినిమా టాక్సిక్. ఈ యాక్షన్ మూవీకి గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించారు. అలాగే నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి, తార సుతారియా లాంటి హీరోయిన్లు కూడా ఉన్నారు. అయితే ఈ సినిమా ఆగస్టు 26వ తేదీన రిలీజ్ కానున్న నేపథ్యంలో ప్రమోషన్స్ లో చిత్ర బృందం పాల్గొంటుంది. యష్ కూడా ప్రమోషన్స్ లో బిజీ అయిపోయాడు. ఈ నేపథ్యంలోనే చిన్న పిల్లలు టాక్సిక్ సినిమా చూడొద్దంటూ కోరారు. ఈ సినిమాకు దూరంగా ఉండాలని రిక్వెస్ట్ చేశారు. ఇది పెద్దల సినిమానే అంటూ స్పష్టం చేశారు. ఈ సినిమా పిల్లల కోసం చేయలేదు... ఏది రైట్, ఏది రాంగ్ అనేది పెద్దలు తెలుసుకోగలరని వివరించారు. సినిమాలో ఏం చూడాలి? ఏం నేర్చుకోవాలి? జీవితంలో ఏం చేయాలో వారికి తెలుస్తుందన్నారు. కానీ ఇది జెన్యూన్ సినిమా అని, డీప్ స్టోరీ కూడా ఉంటుందని ప్రకటించారు యష్.

## విలన్ వేటలో రామ్..




ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ~ర్యాపో23. సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ భారీ ప్రాజెక్ట్ ఇటీవల పాండిచ్చేరిలో భారీ సెటప్‌లో టీమ్ 9 రోజుల పాటు షూటింగ్ చేశారు. వర్షాల కారణంగా షెడ్యూల్‌కు బ్రేక్ పడింది. అయితే ఈ సినిమాలో హీరోకు సమానమైన విలన్ పాత్ర కోసం చిత్ర యూనిట్ గట్టిగా శ్రమిస్తోంది.సినిమాలోని నెగెటివ్ రోల్ కోసం మేకర్స్ ముందుగా మలయాళ వర్సటైల్ యాక్టర్ ఫహద్ ఫాసిల్ ను సంప్రదించారట. అయితే డేట్స్ కుదరకపోవడంతో ఈ కాంబినేషన్ కుదరలేదు. ఆ తర్వాత కోలీవుడ్ పాపులర్ విలన్ ఎస్‌జే సూర్యను అప్రోచ్ అయ్యారు. అయితే ఆయన ఈ పాత్ర కోసం దాదాపు రూ. 7 నుంచి 8 కోట్ల వరకు రెమ్యునరేషన్ డిమాండ్ చేసినట్లు సమాచారం. ఆ రేంజ్ రెమ్యునరేషన్ బడ్జెట్ పరిమితులకు మించడంతో మేకర్స్ ప్రత్యామ్నాయం వైపు చూశారు. చివరకు ఈ పవర్ ఫుల్ యాంటాగొనిస్ట్ రోల్ కోసం బాలీవుడ్ హీరో రితేష్ దేశ్‌ముఖ్ ను ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. జెనీలియా భర్త అయిన రితేష్, రామ్ పోతినేనికి మంచి ఆత్మీయుడు, ప్రాణస్నేహితుడు. ఈ క్యారెక్టర్‌కి రితేష్ అయితే కొత్తదనంతో పాటు పాన్-ఇండియా అప్పీల్ వస్తుందని భావించి మేకర్స్ ఆయన వైపు మొగ్గు చూపారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న ఈ సినిమాకు సామ్ సీయస్ సంగీతం అందిస్తున్నాడు.

## జైలర్-2 నుంచి డబుల్ ధమాకా..




సూపర్ స్టార్ రజనీకాంత్, డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జైలర్-2'. 2023లో వచ్చి బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం అందుకున్న 'జైలర్'కు సీక్వెల్‌లో ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే వచ్చిన ప్రతి అప్డేట్ ఎంతగానో ఆకట్టుకోగా.. తాజాగా ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'విందు సిద్ధమైంది.. జైలర్-2 మొదటి పాట ఆగస్టు 21న విడుదల కాబోతున్నది' అంటూ ప్రకటిస్తూ రజినీకాంత్‌కు సంబంధించిన పవర్ ఫుల్ పోస్టర్‌ను షేర్ చేశారు. ఇందులో ఇంకో విశేషం ఏంటంటే.. ఈ సినిమాను ఈ ఏడాది అక్టోబర్ 15న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నట్లు ఇప్పటికే టీమ్ అఫీషియల్‌గా ప్రకటించారు. కానీ, కొన్ని అనివార్య కారణాల చేత ఈ సినిమా రిలీజ్ వాయిదా పడిందని, అక్టోబర్ 15న రిలీజ్ కావడం కష్టం అంటూ కొన్ని పుకార్లు షికార్లు చేశాయి. ఇప్పుడు ఇచ్చిన అప్డేట్‌తో ఈ సినిమా వాయిదా పడినట్లు వస్తున్న వార్తలకు కూడా చెక్ పడినట్లు అయింది. ఈ స్పెషల్ పోస్టర్‌తో జైలర్-2 చిత్రం అక్టోబర్-15న రాబోతున్నట్లు మరోసారి కన్ఫర్మ్ చేశారు.




## జెట్ స్పీడ్‌లో 'మెగా158'..

గాస్టార్ చిరంజీవి, బాబి కొల్లి దర్శకత్వంలో 'మెగా 158' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న చిత్రంలో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్ వీడియోను చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 22న విడుదల చేయబోతున్నట్లు తెలుస్తోంది. అదే రోజున ఈ సినిమాకు సంబంధించిన టైటిల్‌ను కూడా అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి 'కదిరి కాకాజీ' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దాదాపుగా ఇదే టైటిల్‌ను ఖరారు చేసినట్లు, చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం.ఇక ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా చిరంజీవి పుట్టినరోజునే వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ మూవీ షూటింగ్ కొంతకాలం క్రితమే ప్రారంభమైంది. ఇప్పటివరకు 40 రోజుల షూటింగ్‌ను పూర్తి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ 40 రోజుల్లోనే సినిమా ఫస్ట్ హాఫ్ షూటింగ్ పూర్తయినట్లు, దానికి సంబంధించిన ఎడిటింగ్ పనులు కూడా పూర్తయినట్లు సమాచారం. దీంతో ఈ సినిమాకు సంబంధించిన మొత్తం పనులు మరో మూడు, నాలుగు నెలల్లో పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.








## వెంకీ మామను ఢీకొట్టేందుకు రెడీ అయిన సందీప్ కిషన్..

సినిమా ఇండస్ట్రీలో ఒకే రోజు కొన్ని సందర్భాల్లో రెండు, మూడు క్రేజీ చిత్రాలు విడుదలవుతుంటాయి. అక్టోబర్ 2న కూడా ఇదే పరిస్థితి నెలకొనబోతుంది. ఇప్పటికే ఈ తేదీన విక్టరీ వెంకటేష్ హీరోగా, శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం ఏకే 47' చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మూవీ నుంచి విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. అలాగే గతంలో వెంకటేష్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలు మంచి విజయాలను సాధించడంతో ఈ మూవీపై భారీ స్థాయిలో అంచనాలు ఉన్నాయి.ఇక ఇదే తేదీన సందీప్ కిషన్ హీరోగా, జేసన్ సంజయ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సిగ్మా' చిత్రాన్ని కూడా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సినిమాను తమిళ్, తెలుగు భాషల్లో ఇదే తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. తమిళ్ వరకు 'సిగ్మా'కు పెద్దగా సమస్య లేకపోయినా, తెలుగులో మాత్రం ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అందుకు ప్రధాన కారణం 'ఆదర్శ కుటుంబం ఏకే 47' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉండటమే. ఈ మూవీకి పెద్ద సంఖ్యలో థియేటర్లు కేటాయించే అవకాశం ఉండటంతో 'సిగ్మా'కు తక్కువ థియేటర్లు దక్కే ఛాన్స్ ఉందని అంటున్నారు. అలాగే ఫ్యామిలీ ఆడియన్స్ 'ఆదర్శ కుటుంబం'పై ఎక్కువగా ఆసక్తి చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి 'సిగ్మా' తెలుగు రాష్ట్రాల్లో 'ఆదర్శ కుటుంబం' చిత్రాన్ని తట్టుకుని నిలబడుతుందా? లేదా? అనేది చూడాలి.

## రన్ టైమ్ ఎంతంటే?




మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త చిత్రం 'ఇరుముడి'. ఈ నెల 21న వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతుంది. ఈ నేపథ్యంలో సెన్సార్ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'యు/ఎ' సర్టిఫికెట్ జారీచేసారు. మొత్తం 2 గంటల 25 నిమిషాల క్రిస్పీ రన్‌టైమ్‌ను మేకర్స్ లాక్ చేశారు. సెన్సార్ సభ్యుల నుంచి ఈ సినిమాకు చాలా మంచి రెస్పాన్స్ వచ్చినట్లు ఫిల్మ్‌నగర్ వర్గాల్లో టాక్ నడుస్తోంది.ఈ చిత్రానికి తండ్రి-కూతుళ్ల సెంటిమెంట్ ప్రధాన బలంగా నిలవనుందని, దానికి తోడు క్రైమ్ సస్పెన్స్ డ్రామా ఎలిమెంట్స్ కూడా అద్భుతంగా వర్కౌట్ అయ్యాయని తెలుస్తోంది. ముఖ్యంగా కథానాయకుడి పాత్ర అయ్యప్ప మాల వేసుకున్న తర్వాత అతని ప్రవర్తనలో, క్యారెక్టర్‌లో వచ్చే మార్పులు సినిమాకే ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. దర్శకుడు శివ నిర్వాణ టేకింగ్, కథనాన్ని నడిపిన తీరుతో పాటు జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్ అయ్యాయని సమాచారం. ముఖ్యంగా 'అయ్యప్ప స్వామి ఇరుముడి కట్టు', 'మల్లెపూల పల్లకి' పాటలతో పాటు ఆయన అందించిన రీ-రికార్డింగ్ ఈ చిత్రానికి ప్రధాన పిల్లర్స్‌గా నిలిచాయని చెబుతున్నారు. అయితే, ఈ చిత్రంలోని 'మల్లెపూల పల్లకి' పాటలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ క్యామియో రోల్ చేస్తున్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం సాగింది. దీనిపై దర్శకుడు శివ నిర్వాణ స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. 'మల్లెపూల పల్లకి' పాటలో రామ్ చరణ్ క్యామియో ఉందనే వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు.

## అందుకే పిల్లలను వద్దనుకున్నా..

ఒక మహిళగా, ఒక నటిగా సమాజంలో ఎంతో ధైర్యంగా నిలబడాలని ప్రయత్నించిన తనకు, తన మాజీ ప్రియుడి ప్రవర్తన వల్ల తనపై తనకే సిగ్గుచేటుగా అనిపించే పరిస్థితి వచ్చిందని ఆమె తెలిపారు. ప్రతి నెలా ఒక స్త్రీగా సహజంగా జరిగే పీరియడ్స్ ప్రక్రియను కూడా అతడు చాలా చులకనగా చూసేవాడని వెల్లడించారు. తాను ఏ రోజైనా అతని తప్పులను ప్రశ్నించడానికి ప్రయత్నిస్తే, వెంటనే నీకు పీరియడ్స్ సమయమా లేక ఇంకా రాలేదా అని ప్రశ్నిస్తూ, ఇదంతా కేవలం మూడ్ స్వింగ్స్ వల్ల మాత్రమే అని చాలా తేలిగ్గా కొట్టిపడేసేవాడని చెప్పారు.ప్రతిసారీ ఆ రకమైన వ్యాఖ్యలు విన్నప్పుడు ఒక మహిళగా పుట్టినందుకే కదా ఇలాంటి మాటలు అనిపించుకోవాల్సి వస్తోందని, తన ఉనికిపై తనకే అసహ్యం వేసేదని ఆమె స్పష్టం చేశారు. ఈ విషపూరితమైన రిలేషన్షిప్ వల్ల తన జీవిత లక్ష్యాలు, ఆలోచనలు కూడా పూర్తిగా మారిపోయాయని అనుపమ ఆవేదన చెందారు. చిన్నప్పటి నుంచి తనకు 11 మంది పిల్లలు ఉండాలని ఎంతో ఆశగా కలలు కనేదాన్ని అని, కానీ ఆ వ్యక్తితో గడిపిన రెండేళ్ల కాలం తర్వాత, భవిష్యత్తులో అసలు పిల్లలే వద్దు అనే తీవ్రమైన నిర్ణయానికి వచ్చేలా తన ఆలోచనలను దిగజార్చాడని తెలిపారు. అతడి ప్రవర్తన వల్ల తాను తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లిపోయానని, ఆ చేదు జ్ఞాపకాల నుంచి బయటపడటానికి చాలా సమయం పట్టిందని చెప్పారు. ప్రస్తుతం అనుపమ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.



Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**